



తిరుమలలో శాంతి హోమం

శ్రీవారి లడ్డూప్రసాదాల్లో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసి పవిత్రత దెబ్బతిన్నదనే అభిప్రాయాలకు మేరకు టీటీడీ పరిహారం కోసం సోమవారం శాంతి హోమం నిర్వహించింది. సంప్రోక్షణ నిర్వహించి పవిత్రతను తిరిగి పెంపొందించాలంటూ సీఎం, పలువురు మాజీ అధికారులు, పండితుల నుంచి అభిప్రాయాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీటీడీ ఆగమ సలహా మండలి సభ్యులైన వేణుగోపాలదీక్షితులు, మోహనరంగాచార్యులు, రామకృష్ణదీక్షితులు, సీతారామచార్యులు, నూజివీడు గోపాల కృష్ణమాచార్యులు ఆలయంలో శాంతిహోమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. భక్తుల దర్శనాలకు, స్వామి కైంకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 6 నుంచి 10 గంటల నడుమ ఆలయంలోని బంగారుబావి వద్దనున్న మండపంలో శాంతిహోం నిర్వహించారు. కలుషిత నెయ్యి వినియోగం జరిగిన ప్రతి ప్రదేశంలో తొలుత వాస్తుదూపాన్ని వేశారు. యాగశాలలో సంకల్పం, విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనం, వాస్తుహోమం, కుంభప్రతిష్ఠ, పంచగవ్య ఆరాధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా ఆలయంలోపల, బయటప్రాంతాల్లో కుంభప్రోక్షణ చేయడంతో శాంతిహోమం ముగిసింది. దీంతో సర్వదోషాలు తొలగిపోయాయని అర్చకులు తెలిపారు. క్రతువు ముగిసిన గంటల వ్యవధిలోనే తిరుమలలో చిరుజల్లులు కురవగా.. ఇది మంచి పరిణామమని పండితులు అభిప్రాయపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





రాజుకున్న రాజకీయ వేడి

కల్తీ నెయ్యి వాడకంపై ఒకవైపు తిరుమల ఆలయంలో టీటీడీ శాంతి హోమం నిర్వహించగా.. మరోవైపు ఈ వివాదం రాజకీయంగా రాజుకుంది. టీటీడీ చైర్మన్‌గా తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భూమన కరుణాకరరెడ్డి సోమవారం తిరుమలకు వెళ్లారు. రాజకీయ ప్రసంగం చేయకూడదని పోలీసులు నోటీసులివ్వగా సంతకం చేశారు. ఎంపీ గురుమూర్తి, కుమారుడు అభినయ్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన శ్రీవారి పుష్కరిణిలో స్నానం చేసి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అఖిలాండం వద్ద హారతి ఇచ్చే క్రమంలో ప్రార్థన చేస్తున్నట్లుగా.. రాజకీయ వ్యాఖ్యలు చేశారు. వెంటనే పోలీసులు అడ్డుకుని బలవంతంగా తిరుపతికి పంపారు. నిబంధనలు ఉల్లంఘించారని వివిధ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది కూడా. ఈ వివాదం కేంద్రంగా రాజకీయ వేడి రాజుకుంది. భూమన ప్రమాణాన్ని నిరసిస్తూ టీడీపీ నేతలు తిరుపతిలో గోవిందనామాలతో శ్రీవారిని ప్రార్థించారు. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి అపచారాలు జరగకూడదని శ్రీవారి ప్రార్థిస్తూ తిరుమలలో టెంకాయలు కొట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



మేము తప్పు చేసుంటే..

కల్తీ నెయ్యిలో మేం తప్పు చేసుంటే మా కుటుంబ సర్వనాశనమై, రక్తం కక్కి చనిపోవాలని పుష్కరిణిలో మునిగి ప్రమాణం చేశా. నేను క్రిస్టియన్ కాదు.. నాస్తికుడిని అంతకన్నా కాదు. వీటిపై కూడా ప్రమాణం చేయమన్నా చేస్తా. సిట్ కాదు.. సీబీఐ, సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేయించండి.

- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్

నీ నాస్తిక ప్రమాణం ఒక ప్రామాణికమా?

● భూమనపై టీడీపీ నేతల ఆగ్రహం

తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'నువ్వు నాస్తికుడివని ఊరంతా తెలుసు. అన్యమత అభిమానిగా అందరికీ పరిచయస్తుడివి. తిరుమల కొండపై నీలాంటి వ్యక్తి చేసే ప్రమాణాలకు ప్రామాణికత ఏముంటుంది?' అంటూ టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డిపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపై భూమన చేసిన ప్రమాణాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం అలిపిరి గరుడ సర్కిల్లో గోవింద నామాలతో శ్రీవారిని ప్రార్థించారు. 'గత ఐదేళ్లలో తిరుమలను అపవిత్రం చేయడంతోనే చాలా దేవాలయాల్లో రథాలు కాలిపోయాయి. గోవిందరాజస్వామి గుడి వద్ద వటవృక్షం పడిపోయింది. తిరుమల కాలిబాటలో భక్తులను పులులు ఇబ్బంది పెట్టాయి. దేవుడంటే భయంలేదు కాబట్టే కొండపైన ప్రమాణాల డ్రామాలు ఆడారు' అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు.



తిరుమల అఖిలాండం వద్ద ప్రమాణాలు చేసిన కరుణాకర్ రెడ్డి అవినీతి అక్రమాలు, దేవస్థానం ఖజానాను ఖాళీ చేసిన వైనం నీ పరాకాష్టకు నిదర్శనమని తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. 'ఇప్పుడు చేసిన పాపాలు చాలవా? బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి కోనేరును పరిశుభ్రం చేసి పవిత్రంగా ఉంచిన ఈ సందర్భంలో మళ్లీ ఆ కోనేట్లో స్నానం చేసి అపవిత్రాన్ని మూటకట్టుకున్నావు' అంటూ మండిపడ్డారు. ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, మనోహరాచారి, ఆముదాల తులసీరాం, ఈతమాకుల హేమంత్ యాదవ్, రవిశంకర్ యాదవ్, బ్యాంకు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎవరు నెత్తురు కక్కాలో దేవుడు నిర్ణయిస్తాడు



గడిచిన ఐదేళ్ల తిరుమల కొండపై జరిగిన ఘోరాలను యావత్ హిందూ సమాజం చూసింది. లడ్డూ బాగలేదని తమిళనాడు నుంచి ఓ భక్త బృందం మాట్లాడితే విజిలెన్స్ వాళ్లతో కొట్టించలేదా? ఎవరు నెత్తురు కక్కాలో దేవుడు నిర్ణయిస్తాడు. వడ్డికాసులవాడు లెక్కలన్నీ తేలుస్తాడు. జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తం పొందకుండా జగన్ రెడ్డి ఎదురుదాడి చేయడమేంటో?

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

శ్రీవారికి కొబ్బరికాయల సమర్పణ

తిరుమల, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తెలుగుదేశం పార్టీ శ్రేణులు సోమవారం అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. గత ప్రభుత్వంలో జరిగిన లోపాలు ఒకోక్కటిగా బయటకు వస్తుండంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి అపచారాలు జరగకుండా ఆశీస్సులు ఇవ్వాలని స్వామిని ప్రార్థించారు. తిరుమల టీడీపీ అధ్యక్షుడు రాజుయాదవ్ ఆధ్వర్యంలో 501 కొబ్బరికాయలు సమర్పించారు. లడ్డూప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరగడం బాధాకరమన్నారు. లడ్డూ నాణ్యత పెంచేవిషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ వహించడంతో తిరిగి లడ్డూకు పవిత్ర చేకూరిందన్నారు.



108 మందికి రెవెన్యూలో స్థానచలనం

● వీఆర్వోల బదిలీలు నేటికి వాయిదా

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: తిరుపతి జిల్లాలో దాదాపు 108 మంది రెవెన్యూ ఉద్యోగులు సోమవారం బదిలీ అయ్యారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలతో అంటకాగిన కొంత మంది రెవెన్యూ సిబ్బంది.. ఇప్పుడూ కొందరు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకుని తమ స్థానాలను పదిలం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగాల్లో కొంతమందిపై అవినీతి ఆరోపణలున్న వాళ్లూ బదిలీ నుంచి తప్పించుకున్నారు. వీరంతా 'అన్ని విధాలా' పలుకుబడి ఉపయోగించుకున్నట్లు రెవెన్యూ శాఖలో విమర్శలు నెలకొన్నాయి. మరోవైపు ఇద్దరు ఉన్నతాధికారులు దాదాపు 24 గంటలు సమాలోచనలు జరిపి సిపార్సు లేఖలున్న వారికి ప్రాధాన్యమిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తమ్మీద సోమవారం రాత్రి కలెక్టరేట్ అధికారులు విడుదల చేసిన బదిలీల జాబితాల్లో 36మంది డిప్యూటీ తహసీల్దార్లు, 50 మంది రెవెన్యూశాఖ సీనియర్ అసిస్టెంట్లు, 22మంది జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. అటు రాజకీయ నాయకులు, ఇటు కలెక్టరేట్‌లోని ఇద్దరు అధికారులు తమకు కావాల్సిన వారికి పోస్టింగ్ వేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక, జిల్లాలో వీఆర్వోల బదిలీలు సాగుతూ.. వాయిదా పడ్డాయి. సుమారు 200మందికి మంగళవారం ఉదయం పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు సమాచారం. మిగిలిన వారిని యథాస్థానంలో ఉంచేందుకు రాజకీయ సిఫార్సులు, అధికారుల సహకారం అందనుంది.

డిస్కంలో భారీగా బదిలీలు

తిరుపతి, (ఆటోనగర్): సదరన్ డిస్కంలోని తిరుపతి సర్కిల్‌లో 76 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈఈలు 28, ఏడీఈలు 58 మందిని బదిలీ చేస్తూ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు ఇచ్చారు. చేశారు. తిరుపతి సర్కిల్ పరిధిలో ఈఈల బదిలీల్లో భాగంగా తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న చంద్రశేఖర్ తిరుపతి టౌన్ డివిజన్ ఈఈగా.. ఆ స్థానంలో ఉన్న కె.వాసుదేవ రెడ్డిని చిత్తూరు ఎం ఎండ్‌పీకి బదిలీ చేశారు. తిరుపతిరూరల్ డివిజన్ ఈఈ మినహా మిగిలిన వారిని కూడా బదిలీ చేశారు. అలాగే డీఈఈలను అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బదిలీలు చేసినట్లు తెలిసింది.

ఎక్సైజ్‌లో బదిలీల పైరవీలు

● ఒక్కో సీటుకు 10 సిఫార్సు లేఖలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 23: ఎక్సైజ్ శాఖలో బదిలీల పైరవీలు ఊపందుకున్నాయి. ప్రధానంగా తిరుపతి, చంద్రగిరి, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి ప్రాంతాలకు స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు ఒక్కో సీటుకు 10 నుంచి 12 మందికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు సమాచారం.గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కొందరు ఉద్యోగులు.. ప్రస్తుతం తమ స్థానాలను పదిలం చేసుకునే పనిలో పడ్డారు. కోరుకున్న స్థానాల్లో కూర్చోవడానికి ఇంకొందరు కూటమి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లా కేంద్రమైన తిరుపతికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఈఎస్ నుంచి ఏఈఎస్, సీఐలుగా పని చేయడానికి గట్టి పోటీ వుంది. తిరుపతికి పొరుగు నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఒకరు తాము సిఫార్సు లేఖ అందచేసిన ఇద్దరు అధికారుల్లో ఒకరిని సీఐగా నియమించాలని మంత్రి కొల్లు రవీంద్రకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.



వరద బాధితుల కోసం..

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి సోమవారం సీఎం చంద్రబాబుకు రూ.20 లక్షల చెక్కు అందజేస్తున్న తిరుపతిలోని స్విమ్స్ డైరెక్టరు ఆర్వీ కుమార్

కడపజోన్ ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి బదిలీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 23: కడపజోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇటీవల ఆయన పదోన్నతిపై కడప జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. వారం వ్యవధిలోనే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఖాళీగా ఉన్న తిరుపతి డీపీటీవో పోస్టును రేపో మాపో భర్తీ చేయనున్నట్లు తెలిసింది. కడపజోన్ ఈడీగా పి.చంద్రశేఖర్, చిత్తూరు డీపీటీవోగా జగదీష్‌ను బదిలీ చేశారు. అలాగే వాకాడు డిపో మేనేజర్‌గా పెంచలయ్య, కుప్పం డిపో మేనేజర్‌గా గోపీనాథ్, శ్రీకాళహస్తి ఇన్‌చార్జి డీఎంగా తిరుపతి డిపో మేనేజర్ టి.బాలాజీ నియమించారు.

డబుల్ డెక్కర్ ఫర్ సేల్

● సెకండ్ హ్యాండ్‌లో అమ్మేస్తాం కొనుక్కోండి ప్లీజ్

● బస్సును వదిలించేందుకు కార్పొరేషన్ బేరసారాలు



తిరుపతి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ నేతలు కార్పొరేషన్ నిధులతో వెచ్చించి ఆర్భాటాల కోసం తీసుకొచ్చిన డబుల్ డెక్కర్ బస్సును అమ్ముకునేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఎంతోకొంతకు అమ్మేస్తాం.. ప్లీజ్ అంటూ బేరసారాలు నడుపుతున్నారు. అయితే సెకండ్ హ్యాండ్‌లో అమ్ముతామన్న కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గార్బేజ్ షెడ్డులో పడున్న బస్సును వదిలించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు రూ2.5 కోట్ల ప్రజాధనం పోసి కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోవడాన్ని సోమవారం కమిషనర్ ఎన్.మౌర్య దృష్టికి మీడియా ప్రతినిధులు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆమె వైజాగ్ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తమదగ్గర డబుల్ డెక్కర్ బస్సు ఉందని ఏదోఒక ధరకు ఇచ్చేస్తామని చెప్పారు. డబుల్ డెక్కర్‌పైన వైజాగ్‌లాంటి నగరపాలక సంస్థ కూడా అంగీకరించకపోవడంతో 'మీరే ఏదైనా మార్గం చెప్పండి' అని మీడియా ప్రతినిధులనే అడిగారు. ఇటీవల జూపార్కుకు మినీ డబుల్ డెక్కర్ బస్సును కొనుగోలు చేశారని, అక్కడ ప్రయత్నం చేయమని చెప్పడంతో విచారించమని అధికారులను ఆదేశించారు.

నాడు గొప్పలు.. నేడు తిప్పలు

దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతికి డబుల్ డెక్కర్ బస్సు తీసుకొచ్చామని వైసీపీ స్థానిక నేతలు గొప్పలు చెప్పారు. అక్కరకు రాక దానిని అమ్ముకునేందుకు ఇప్పుడు అధికారులు తిప్పలు పడుతున్నారు. మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి గత ఏడాది ఆగస్టు 8న జరిగిన కౌన్సిల్లో ప్రతిపాదించి రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులనుంచి డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేయించారు. తొలుత బస్సును ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. ఈ తరహా బస్సుల నిర్వహణకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో వారు నిరాకరించారు. చివరకు కార్పొరేషన్ భుజాలకెత్తుకుంది. ఇరుకురోడ్లలో బస్సు రాకపోకలకు కష్టతరంగా మారడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నేలకూల్చి, నిలువ నీడ లేకుండా చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి దిగినా రూ.50 బస్సు ఛార్జీని నిర్ణయించారు. రోజుకు పది మందికూడా ఎక్కకపోవడంతో కొంతకాలం ఉచితంగా తిప్పారు. బస్సుకు ఆర్టీసీ నుంచి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. కానీ దర్జాగా రోడ్లపై తిరిగేసింది. చట్టరీత్యా నేరం కావడంతో కార్పొరేషన్ అధికారులకు రవాణాశాఖ అధికారులు లేఖ రాశారు. బస్సు సీజ్ చేయాల్సివస్తుందని హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో వినాయకసాగర్ వద్దగల గార్బేజ్ షెడ్డులో బస్సును పార్కు చేసి పెట్టేశారు.

మరో 65 మంది ఇంటికి..!

● వైసీపీ హయాంలో ఎస్వీయూలో చేరిన ఉద్యోగులపై ప్రభుత్వం కొరడా

● తక్షణ నివేదిక పంపాలని అధికారులకు ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీయూలో చేరిన మరో 65 మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా 14 మందిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరో 65 మంది తొలగింపు విషయమై యూనివర్సిటీ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై తక్షణం తమకు నివేదిక పంపాలని ఇటీవల ప్రభుత్వం నుంచీ యూనివర్సిటీకి ఆదేశాలు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో ఆ ఉద్యోగుల జాబితాను యూనివర్సిటీ అధికార యంత్రాంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇందులో ఉద్యోగి పేరు, విద్యార్హత, వర్క్ ప్లేస్, వేతనం, ఎవరి సిఫారసుతో ఉద్యోగంలో చేరారనే అంశాలతో నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచీ సంకేతాలు వెలువడిన వెంటనే ఈ 65 మంది ఉద్యోగులకు పొడిగింపు ఉత్తర్వులు నిలిపివేయడం ద్వారా ఉద్యోగాల నుంచీ తొలగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ముక్కంటి ఆలయ ఈవోగా చంద్రశేఖర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా చంద్రశేఖర్ ఆజాద్ (ఎఫ్ఏసీ) బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ఆర్టీసీగా నియమితులైన ఈయనకు ముక్కంటి ఆలయ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని, బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలోని పలు విభాగాలను తనిఖీ చేశారు.



కార్పొరేషన్లో బదిలీల షురూ

తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్‌లో బదిలీలు మొదలయ్యాయి. ఎస్‌ఈ మోహన్‌ను నెల్లూరు పబ్లిక్ హెల్త్‌కు.. గుంటూరు ఎస్‌ఈ శ్యాంసుందర్‌ను ఆయన స్థానంలో నియమించారు. ఎంఈలుగా ఉన్న చంద్రశేఖర్ తుడా ఈఈగా, వెంకటరామి రెడ్డిని చిత్తూరు ఈఈగా బదిలీ చేశారు. వారి స్థానంలో చిత్తూరునుంచి తులసీకృష్ణ, గోమతి రానున్నారు. రెవెన్యూ అధికారి కేఎల్ వర్మ బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిపాలనాధికారిగా, ఇక్కడ మేనేజర్‌గా ఉన్న చిట్టిబాబు అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిపాలనాధికారిగా బదిలీపై వెళ్లనున్నారు. టౌన్‌ప్లానింగ్‌లో డీసీపీ శ్రీనివాసులరెడ్డిని జీఏడీలో రిపోర్ట్ చేయమని ఆదేశించగా.. ఆయన స్థానంలో గుంటూరు డీసీపీ మహాపాత్ర రానున్నారు. మెప్మా కోఆర్డినేటర్ కృష్ణవేణి మదనపల్లెకు, జిల్లా పీడీ కార్యాలయంలో పనిచేసే శ్రీరాములు ఇక్కడి మెప్మా కోఆర్డినేటర్‌గా బదిలీపై రానున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 82,436 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,437 మంది తలనీలాలు సమర్పించారు.



దయలేని రుయా

రుయాస్పత్రిలో పేద రోగులకు, వారి సహాయకులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం వచ్చిందంటే ఇటు అధికారులు అటు సిబ్బంది హడావుడే కానీ రోగుల సేవలో మాత్రం ఏ ఒక్కరూ కనిపించరు. ఇందుకు సోమవారం నాటి ఈ చిత్రాలే నిదర్శనం. ఓపీ కేంద్రం నుంచి దాదాపు అర కిలోమీటరు దూరంలోని ఆర్థో వార్డుకు వెళ్లే అధ్వాన రోడ్డులో రోగులను వారి సహాయకులు వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై అతి కష్టంతో తీసుకెళుతూ కనిపించారు. అప్పుడప్పుడు అధికారులు వచ్చే సమయంలో మాత్రం సిబ్బంది ఖాళీ వీల్‌చైర్లు, స్ట్రెచర్లతో హడావిడి చేస్తారు. ఆ తర్వాత రోగుల ఇబ్బందులు వారివే.

\- తిరుపతి(వైద్యం)



సర్వభూపాల వాహనాన్ని ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న బేరర్లు - సిద్ధమవుతున్న త్రేతాయుగం సెట్టింగ్

జోరుగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే విద్యుత్, గ్యాలరీలు, బారికేడ్ల పనులు పూర్తిచేసిన అధికారులు ప్రస్తుతం ఆలయ మహాద్వారం గేట్లు శుభ్రపరుస్తున్నారు. ఫలపుష్పప్రదర్శనశాల ఏర్పాటు పనులు కల్యాణవేదికలో మొదలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం సర్వభూపాల వాహనాన్ని ట్రయల్‌రన్ నిర్వహించారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

'ఎర్ర' దొంగ అరెస్టు.. 11 దుంగలు స్వాధీనం

మంగళం, సెప్టెంబరు 23: పీలేరు, భాకరాపేట ప్రధాన మార్గంలోని ఎలమంద క్రాస్ వద్ద టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఐలు విష్ణువర్ధన్‌కుమార్, సురేష్‌బాబు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వీరిని గమనించిన స్మగర్లు రెండు కార్లు దూరంగా ఆపి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ కార్లకు పైలెట్లుగా ఉన్న రెండు మోటారుసైకిళ్లను అక్కడే వదలి పారిపోయారు. టాస్క్‌ఫోర్సు సిబ్బందివారిని వెంబడించి ఒకరిని పట్టుకోగలిగారు. అతడు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా జమునాపుత్తూరుకు చెందిన వాడిగా గుర్తించారు. పట్టుబడ్డ స్మగ్లరు, ఎర్రచందనాన్ని, వాహనాలను టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న చంద్రగిరి కోటలో సౌండ్స్, లైట్స్‌షో ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న చంద్రగిరి కోటలో సౌండ్స్ అండ్ లైట్స్ షోను సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్షిస్తూ.. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పర్యాటక శాఖ, లక్స్ అండ్ డెసిబెల్స్ ప్రైవేటు భాగస్వామ్యంతో సంయుక్తంగా పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్(పి.పి.పి) విధానంలో రూ.6కోట్లతో లైట్స్ అండ్ సౌండ్‌షోను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణప్రసాద్, ఏపీటీడీసీ డీవీఎం గిరిధర్‌రెడ్డి, ఈఈ సుబ్రహ్మణ్యం, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, కేంద్ర ఆర్కియాలజీ సబ్ సర్కిల్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్, లక్స్ అండ్ డిసిబుల్స్ ప్రతినిధి శివ పాల్గొన్నారు.

మ్యాంగో బోర్డు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు కృషి

పాకాల, సెప్టెంబరు 23: రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కోసం మ్యాంగో బోర్డు, కోల్డ్ స్టోరేజి ఏర్పాటుకు కృషి చేస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. మండలంలోని రవణయ్యగారిపల్లెలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నూరు రోజుల్లో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తున్నాయన్నారు. దామలచెరువులో ఉర్దూ స్కూలు, మొగరాలలో విద్యుత్ సబ్‌స్టేషన్, దామలచెరువు కొమ్మిరెడ్డిగారిపల్లె రోడ్డు మరమ్మతులు చేపడతామన్నారు. అనంతరం ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. సర్పంచ్ యువరాజు, జట్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఎంపీపీ లోకనాథం, ఎంపీటీసీ విజయసింహారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బోయపాటి నాగరాజనాయుడు, జనసేన మండల కన్వీనర్ తలారి గురునాథ్ పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

అథ్లెటిక్స్ పోటీల్లో ఎడిఫై విద్యార్థుల ప్రతిభ

తిరుచానూరు, సెప్టెంబరు 23: నల్గొండలో జరిగిన సీబీఎస్‌ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో తిరుచానూరు ఎడిఫై పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్ తెలిపారు. సోమవారం ఆయన విజేతలను అభినందించారు. అండర్-14, 17, 19 బాలుర విభాగంలో 8 బంగారు, 6 రజతం, ఒక కాంస్య పతకాలు సాధించడమేగాక బాలుర ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారని తెలిపారు. బాలికల విభాగంలో 20 బంగారు, 3 రజతం, ఒక కాంస్య పతకాలు సాధించి, ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 6నుంచి 10వ తేదీ వరకు యూపీలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఎంపికైన 18మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. చైర్‌పర్సన్ సులోచన విద్యార్థులను అభినందించారు. డీన్ జాహ్నవి, ప్రిన్సిపాల్ దేవరాజులు, కోచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ప్రణీత్

తిరుమల ఘాట్‌లో అదుపు తప్పిన జీపు

తిరుమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్ రోడ్డులో సోమవారం ఓ జీపు అదుపు తప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. ఆరుగురు భక్తులతో తిరుమలకు వస్తుండగా ఆరో కిలో మీటరు వద్ద ఈ ప్రమాదం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ జరగలేదు.



భారతీయ జ్ఞాన పరంపరను యువతకు అందించాలి

తిరుపతిరూరల్, సెప్టెంబరు 23:భారతీయ జ్ఞాన పరంపరను యువత, విద్యార్థులకు అందించాలని ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ నేషనల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ గంటి సూర్యనారాయణమూర్తి తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తితో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారతీయ జ్ఞానపరంపర గొప్పతనాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలతో కలపి ఇంటర్ డిస్సిప్లినరీగా పరిశోధన చేయడం వల్ల మంచి ఫలితాలను సాధించవచ్చని అన్నారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆధునిక తరానికి అవసరమైన అంశాలపై పరిశోధనలు చేయాలని తెలిపారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొఫెసర్ లలితారాణి, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగ హెడ్ ప్రొఫెసర్ శివరాం, ప్రొఫెసర్ కె.సూర్యనారాయణ, ప్రొఫెసర్ సోమనాథ్ పాల్గొన్నారు. కాగా సిద్ధాంత నాలెడ్జ్ సంస్థతో ఎంవోయూ: సంస్కృత భాషలోని వివిధ అంశాలు, సైన్స్ అండ్ టెక్నికల్ ఫీల్డ్‌లో మహత్తర అంశాలను వెలికితీసేందుకు సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్‌తో వర్సిటీ అధికారులు పరస్పర అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు.



సదస్సులో సూర్యనారాయణమూర్తి, వీసీ కృష్ణమూర్తి



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

లైసెన్సు ఉన్నవాళ్లే ఇళ్లలో ఉండాలి

- నిషేధిత వస్తువులు వినియోగిస్తే కఠిన చర్యలు
- తిరుమల స్థానికులను హెచ్చరించిన పోలీసులు

తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడటంలో స్థానికులూ భాగస్వాములు కావాలని టూటౌన్ ఇన్‌చార్జ్ సీఐ శేషగిరి కోరారు. సోమవారం సాయంత్రం తిరుమల బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి, ఏఎస్‌ఐ వెంకటమునితో కలిసి ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించారు. బాలాజీనగర్‌లో ఎవరికైతే ఇళ్ల కేటాయిస్తూ లైసెన్సులు జారీ చేశారో వారే ఉండాలని స్పష్టంచేశారు. చాలా మంది బయటవ్యక్తులకు ఇళ్ల అద్దెకు ఇచ్చారని.. హోటళ్లు, దుకాణాల్లో పనిచేసే ఇతర రాష్ట్రాల వాళ్లు ఇక్కడి ఇళ్లలో నివసిస్తున్నారన్నారు. ఇక, తిరుమలలో మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం నిషేధమన్నారు. ఈ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే ఇళ్లను స్వాధీన పరుచుకుంటామని హెచ్చరించారు. త్వరలో బాలాజీనగర్ మొత్తం సీసీ కెమెరాలు పెట్టేందుకు టీటీడీ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు యశ్వంత్ ఎంపిక

చంద్రగిరి, సెప్టెంబరు 23: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు చంద్రగిరి పంచాయతీలోని జమండ్లవీధికి చెందిన సోంపల్లి శేషాద్రి, నీలావతి దంపతుల కుమారుడు యశ్వంత్ ఎంపికయ్యారు. ఈ అనుమతి పత్రాన్ని సోమవారం యశ్వంత్‌కు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అందజేశారు. ఈ అరుదైన గౌరవం తమ పాఠశాల పూర్వ విద్యార్థికి లభించడం గర్వంగా ఉందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయ అన్నారు. తమ పాఠశాలలో 2022-23లో పదో తరగతి చదువుతున్న యశ్వంత్ ఒకేషనల్ టీచర్ షేక్ రియాజ్ ఆలీ మార్గదర్శకంలో జాతీయ చిహ్నం పోస్టరును తయారు చేయడం ద్వారా ఇండియా స్కిల్స్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యాడన్నారు. సర్వశిక్ష అభియాన్ శిక్షణలో ఇండస్ ఎడ్యుట్రైన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ప్రోత్సాహంతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి.. జాతీయ స్థాయిలో 4వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. దీనికిగాను 2025 ఫిబ్రవరి 26న ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారం అందుకుంటాడన్నారు.



కలెక్టర్ నుంచి అనుమతి పత్రాన్ని తీసుకొంటున్న యశ్వంత్

వందరోజుల పాలన విజయవంతం

చంద్రగిరి, సెప్టెంబరు 22: ప్రజల సహాయ సహకారాలతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలన వంద రోజులు విజయవంతంగా పూర్తి చేసుకుందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం చంద్రగిరి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం, ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహించారు. నాని మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిరాదరణకు గురైన చంద్రగిరి నియోజకవర్గం సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. అందరి సహకారంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి త్రికరణ శుద్ధిగా పనిచేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్‌లు అందించనున్నట్లు తెలిపారు. చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం గదిని అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో బాలాజీనాయక్, టీడీపీ నాయకులు కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, శివకోటిరెడ్డి, సర్పంచ్ రూపారామ్మూర్తి పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ఏనుగుల దాడిలో వరిపైరు ధ్వంసం

పాకాల, సెప్టెంబరు 23: మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ నడింపల్లె, కొండకిందపల్లె పరిసరాల్లోని వ్యవసాయ పొలాల్లో ఆదివారం రాత్రి ఏనుగులు దాడులు చేశాయి. రైతులు చుక్కా రత్నమ్మ, ఎస్.వెంకటస్వామి, చుక్కా వెంకటస్వామి, జయచంద్రలకు సంబంధించిన సుమారు పది ఎకరాల వరి పంటను తొక్కేశాయి. అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించాలని, నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని కోరుతున్నారు.



వరి పొలాల్లో ఏనుగుల పాదముద్రలు

మహాకుంభమేళాపై రౌండ్‌టేబుల్ సమావేశం

తిరుపతిరూరల్, సెప్టెంబరు 23: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 2025లో జరుపతలపెట్టిన మహాకుంభమేళాను పురస్కరించుకుని సోమవారం తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఇండియా థింక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సనాతనధర్మ జాగరణం, ఆలయ వ్యవస్థను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలి..? భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ఆధునిక తరానికి ఏ విధంగా అందించాలన్న అంశాలపై చర్చించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, ఇండియా థింక్ కౌన్సిల్ డైరెక్టర్ సౌరవ్‌పాండే, అధ్యాపకులు డాక్టర్ కుమార్‌బాగేవాడి, డాక్టర్ చారుకేష్, మేధావులు, పండితులు పాల్గొని సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి సాయం

పాకాల, సెప్టెంబరు 23: మొగిలి ఘాట్ రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పాకాల మండలం కావలివారిపల్లె పంచాయతీ కంబాలమిట్టకు చెందిన విజయమ్మ కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం అందజేశారు. గ్రామానికి వెళ్లి మృతురాలికి నివాళులర్పించి, చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ చెంగల్రాయులు, టీడీపీ నాయకులు మహేష్ కుమార్, సావిత్రి పాల్గొన్నారు.

పేరూరు ఏఈ బాధ్యతల స్వీకరణ

తిరుపతిరూరల్, సెప్టెంబరు 23: తిరుపతి రూరల్ మండలం పేరూరు సెక్షన్ ఎలక్ట్రికల్ ఏఈగా టి.నీలకంఠయ్య సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. రేణిగుంట నుంచి బదిలీపై ఈయన ఇక్కడకు వచ్చారు.

కార్మికుల కోసం ఆయుష్మాన్ భారత్ వైద్య శిబిరం

చంద్రగిరి, సెప్టంబరు 22: చంద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో సోమవారం కార్మికులకు కోసం వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గాలి పుష్పలత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. చంద్రగిరి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, బీజేపీ నేతలు సుబ్రమణ్యం యాదవ్, తిలక్ యాదవ్, దొరస్వామి, జమ్ముల అరుణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: స్వర్ణాంధ్ర 2047 పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ పక్కాగా తయారు చేయాలని సూచించారు. జేసీ శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, ఎస్డీసీలు చంద్రశేఖర్‌నాయుడు, రామ్మోహన్, నరసింహులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో..

తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ దర్శించుకున్నారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శనం చేసుకున్నారు.



జస్టిస్ శ్యాంసుందర్

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ తిరుపతి

తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ తిరుపతి సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలోని కొన్ని చెత్త డంప్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాలను శుభ్రపరిచి మొక్కలు నాటినట్లు చెప్పారు. మురుగు కాలువల్లో చెత్త తొలగిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మ్యాప్ మై ఇండియా యాప్ ద్వారా ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ఈనెల 26న తిరుపతిలో పర్యాటక శాఖ సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. వేస్ట్ టూ ఆర్ట్, వేస్ట్ టూ వండర్ పోటీల కార్యక్రమంలో అందరూ పాల్గొనవచ్చునని, వేస్ట్ వస్తువుల నుంచి వివిన్న రకాలైనటువంటి వస్తువులను తయారు చేయవచ్చన్నారు. ఉత్తమమైన వాటిని గుర్తించి బహుమతులు ఇస్తామన్నారు. ఉదయం ఆరు గంటలకు వివేకానంద కూడలి నుంచి ఎస్వీ యూనివర్సిటీ పరిపాలన భవన్ వరకు మూడు కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి బహుమతులు ఇస్తామని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ మౌర్యా

31 మంది క్యాడెట్లకు ఎన్‌సీసీ బి-సర్టిఫికెట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23: పద్మావతి డిగ్రీ కాలేజీకి చెందిన 31 మంది క్యాడెట్లు ఎన్‌సీసీ బి-సర్టిఫికెట్లు పొందారు. వీరి ప్రతిభను పరీక్షించిన అధికారులు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ అధికారులు అనూజ్ వాద్వా, ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లు

రుయాలో దుకాణ ఆక్రమణదారులపై ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 23: రుయాస్పత్రిలో దుకాణాన్ని ఆక్రమించిన వారిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అప్పుడు.. ఇప్పుడూ వాళ్లే' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో సూపరింటెండెంట్ రవిప్రభ ఆ దుకాణాన్ని పరిశీలించి.. తక్షణమే ఖాళీ చేయాలని హెచ్చరించారు. ఈ విషయాన్ని వారు ఇటీవల జనసేనలో చేరి రుయా హెచ్‌డీఎస్ సభ్యుడైన నేతకు చెప్పడంతో ఆయన వెంటనే కొందరు నేతలతో ఆ దుకాణం వద్దకు వచ్చారు. రుయా అధికారులతో మాట్లాడి రాజీ చేసేందుకు ప్రయత్నించారు. అధికారులు మాత్రం దుకాణం ఖాళీ చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. అయినా, ఖాళీ చేయకపోవడంతో పోలీస్ అవుట్ పోస్టులో సూపరింటెండెంట్ ఫిర్యాదు చేశారు. హెచ్‌డీఎస్ మీటింగ్‌లో చర్చించాక వాటిని కేటాయిస్తామని అప్పటి వరకు వాటిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఈ దుకాణాన్ని గతంలో నిర్వహిస్తున్న రెడ్డెప్ప మనవరాలిని తానని, ఆయన వారసత్వంగా తనకు చెందుతుందని ప్రస్తుతం దుకాణం ఆక్రమించిన సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వారసురాలిగా తనకు కేటాయించకపోవడంతో కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నట్లు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మా 33 సెంట్లను కబ్జా చేశారమ్మా

- అర్బన్ తహసీల్దారుకు అక్కాచెల్లెళ్ల వినతి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 23: తండ్రి ద్వారా తమకు సంక్రమించిన 33సెంట్ల పట్టాభూమిని కబ్జా చేశారని నలుగురు వృద్ధ అక్కా చెల్లెళ్లు మంగమ్మ, చంద్రమ్మ, కమలమ్మ, ఆదెమ్మ సోమవారం మధ్యాహ్నం అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. శెట్టిపల్లె, చెన్నాయగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్లు 135/19లో ఏ 3సెంట్లు, 135/20లో ఏ 11సెంట్లు, 135/21లో ఏ 8సెంట్లు 135/22 బిలో ఏ 11సెంట్లు మొత్తం 33సెంట్లు తమ తండ్రి ఎం.సంటయ్యపై పట్టా ఉందన్నారు. ఆయన తదనంతరం ఆ భూమి తమ ఆధీనంలో ఉందన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం 2022 అక్టోబరు 17వ తేదీన భూమిని చదును చేస్తుండగా తిరుపతి యాదవకాలనీకి చెందిన శేఖర్‌బాబు(రియల్ ఎస్టేట్ వ్యాపారి)తన అనుచరులతో వచ్చి అడ్డిగించారన్నారు. ప్రశ్నిస్తే ఆ భూమి తనదని దొంగ డాక్యుమెంట్లు చూపించి తమను వెళ్లగొట్టారన్నారు. కొన్నాళ్ల తరువాత తడు నిర్మాణాలు చేపట్టగా తాము అడ్డుకున్నామన్నారు. ఇలా పలుమార్లు అడ్డుకోగా.. అతడు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయించి తమ భూమిని ఇప్పించాలని వేడుకున్నారు. ఈ భూమికి సంబంధించిన పత్రాలను తహసీల్దారు పరిశీలించారు. వీఆర్వోకు పంపి ఆ భూమి పరిస్థితిని చెప్పాలని ఆదేశించారు.



28న బహిరంగ వేలం

చంద్రగిరి, సెప్టెంబరు 23: చంద్రగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారపు సంత, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాల, దినసరి కూరగాయల మార్కెట్టుకు ఈనెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఈవో మహేశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 అక్టోబర్ ఒకటి నుంచి ఆరు నెలల కాలానికి ఈ వేలం వర్తిస్తుందని పేర్కొన్నారు. వారపు సంతకు రూ.4.5లక్షలు, ప్రైవేటు బస్టాండ్‌కు రూ.1.5లక్షలు, జంతు వధశాలకు రూ.50వేలు, దినసరి కూరగాయల మార్కెట్టుకు రూ.40వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం

రామచంద్రాపురం, సెప్టెంబరు 23: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ జిల్లా కార్యదర్శి హరిప్రసాద్ నాయుడు అన్నారు. రాయలచెరువుపేట, రామానాయుడుకండ్రిగ, తాటిమాకులకింద గ్రామాల్లో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా దివాలా తీసినప్పటికీ చంద్రబాబు అనుభవం వల్ల సంక్షేమ పథకాలను గత పాలనకంటే సమర్థవంతంగా అందిస్తున్నారని తెలిపారు. అనంతరం వంద రోజుల పాలన గురించి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటించారు. జిల్లా నాయకులు జనార్దన్‌చౌదరి, మండల నాయకులు మాధవయ్య, నాగభూషణం, దొరస్వామినాయుడు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న హరిప్రసాద్‌నాయుడు

సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోండి

తిరుపతిరూరల్, సెప్టెంబరు 23: పోటీ ప్రపంచంలో విద్యార్థులు అకడమిక్ విజ్ఞానంతో పాటు ఉద్యోగ, ఉపాధికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని తిరుపతికి చెందిన రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బైరాగిపట్టెడలోని కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ(కంప్యూటర్‌సైన్స్)కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం ఇండక్షన్‌పేరిట అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యాల సాధనకు ప్రణాళికలు ఆచరించాలని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనంద్‌రెడ్డి, వై.విజయ్‌రెడ్డి, ఎంబీఏ హెడ్ డాక్టర్ నిరంజన్‌రెడ్డి, ఎంసీఏ అండ్ కంప్యూటర్స్ హెడ్ పి.మధుర పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి

రోడ్డుపైనే నిద్ర

రెండ్రోజులుగా సీపీఐ నారాయణ ఆధ్వర్యంలో దారి కోసం నిరసన తెలిపిన రైతులు

అధికారుల హామీతో ఉద్యమం వాయిదా

నగరి/నిండ్ర, సెప్టెంబరు 23: చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేకి సర్వీసు రోడ్డు కోసం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత రైతులు నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. నిండ్ర మండలానికి చెందిన పాదిరి వద్ద హైవేపై ఆదివారం వంటావార్పు, రహదారి దిగ్బంధం చేయగా, సోమవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి రైతులతో కలిసి నారాయణ కూడా రోడ్డుపైనే నిద్రించారు. సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్తీక్‌రెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు, హైవే అధికారులు నారాయణ వద్దకొచ్చి చర్చలు జరిపారు. సర్వీసు రోడ్డు, సబ్‌వే తదితరాలపై అధికారులు సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిష్కరించడానికి తమ సిబ్బందిని రైతుల వద్దకు పంపుతామని, వారి నివేదిక ప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నట్లు రైతులకు, ప్రజలకు నారాయణ తెలిపారు. కార్యక్రమంలో నగరి మండలానికి చెందిన అయనంబాకం, విజయపురం మండలానికి చెందిన కాళికాపురం, నిండ్ర మండలానికి చెందిన పాదిరి గ్రామాల రైతులు, ఏపీ రైతు సంఘ రాష్ట్ర నాయకుడు రామానాయుడు, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు, చిరంజీవి నాయుడు, భాస్కర్‌రెడ్డి, సీపీఐ తిరుపతి జిల్లా సమితి సభ్యులు మహేష్, నగరి సీపీఐ కౌన్సిల్ సభ్యులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



నారాయణతో చర్చిస్తున్న హైవే అథారిటీ చిత్తూరు పీడీ కార్తీక్‌రెడ్డి

లోక కల్యాణం కోసం కృషి చేయాలి


విజయానంద తీర్థ స్వామి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 23: లోకంలో హిందూ ధర్మరక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ జరగాలని మైసూరు అవధూత దత్త పీఠం ఉత్తరాధికారి విజయానంద తీర్థ స్వామి ఆకాంక్షించారు. చాతుర్మాస దీక్ష ముగించుకుని సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి విచ్చేసిన స్వామి తిరుపతి బైరాగిపట్టెడలో ఉన్న దత్తపీఠంలో విశ్రాంతి కోసం ఆగారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక, భక్తి భావం పెంచే కార్యక్రమాలను విరివిగా చేపట్టాలన్నారు. తిరుమల లడ్డూ వివాదం గురించి స్పందిస్తూ, భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గణపతి సచ్చిదానంద దత్త జ్ఞానబోధ సభ ట్రస్టీ చెన్నుపాటి కృష్ణ, ఉపేంద్ర, మలిశెట్టి రవి, అశోక్ పాల్గొన్నారు.

లడ్డూ కల్తీ ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్వామిజీలు

చంద్రగిరి, సెప్టెంబరు 23: శ్రీవారి ప్రసాదాల్లో జంతువుల కొవ్వు వినియోగాన్ని తెలుగు రాష్ట్రాలలోని మఠాధిపతులు, పీఠాధిపతులు తీవ్రంగా ఖండించారు. దీనిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు మౌన దీక్షలతో నిరసన చేపడతామని తెలిపారు. సోమవారం శ్రీనివాసమంగాపురంలో వశిష్ఠ ఆశ్రమంలో విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ మార్గదర్శక మండలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కేంద్రీయ ప్రధాన కార్యదర్శి భజరంగలాల్ బాగ్డా నేతృత్వంలో మఠాధిపతులు, పీఠాధిపతులు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి నైవేద్యంలో జంతువుల కొవ్వు వినియోగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. లడ్డు అపవిత్రం అనేది క్రూరమైన చర్యగా పేర్కొన్నారు. వెంటనే సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. దోషులను గుర్తించి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలన్నారు. హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోసం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన కమలానంద భారతి స్వామి, శ్రీనివాసనంద భారతిస్వామి, హైదరాబాద్‌కు చెందిన దుర్గానంద పూరిస్వామి, విరజానందస్వామి, స్వరూపానంద స్వామి, తురియనంద సరస్వతి, సంగ్రామ్ మహారాజ్ పాల్గొన్నారు.

భూమనా.. నీ డ్రామాలు కట్టిపెట్టు : టీడీపీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23: టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి డ్రామాలు కట్టిపెట్టాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ కోరారు. భూమన డ్రామాలను ప్రజలు నమ్మరనేందుకు ఎన్నికల్లో ఓటమే సాక్ష్యమని అభిప్రాయపడ్డారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ ఆధారాలతో నిరూపితమైందని, ఇందుకు ధర్మారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి బాధ్యత వహించాలని అన్నారు. కొండను నిలువునా దోచుకున్న భూమన ఇప్పుడు చిలకపలుకులు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

నాస్తికుడికి ప్రమాణం చేసే అర్హత లేదు

తిరుపతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నాస్తికుడికి ప్రమాణం చేసే అర్హత లేదని టీడీపీ నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి లడ్డూతో పాటు కోనేరును కలుషితం చేశారని ఆరోపించారు. తిరుమలలో దొంగ ప్రమాణాలు చేసి, సిట్ దర్యాప్తును పూర్తిగా పక్కదారి పట్టించాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తప్పు చేయకపోతే విచారణకు సహకరించాలని కోరారు. తిరుమలకు ఆయన్ను అనుమతించరాదని డిమాండ్ చేశారు.

కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం


కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 23: మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం హైదరాబాదు నుంచి వచ్చిన ఆయనకు బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వగ్రామం నగరిపల్లికి రోడ్డు మార్గాన వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆమాస రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు మధుసూదన్, పురుషోత్తమనాయుడు, నవీన్‌రెడ్డి, బాబునాయుడు, నిరంజన్‌రెడ్డి, వాసు, బుజ్జి, మహేష్ తదితరులున్నారు.

అండర్ 14 జూడో పోటీలకు ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 23: అండర్ 14 జూడో రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన ఏడుగురు చొప్పున బాలబాలికలు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో రెండు రోజుల పాటు 68వ ఎస్జీఎఫ్ అంతర్ జిల్లాల జూడో అండర్ 14 పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏడు కేటగిరీలలో ఓవరాల్ ఛాంపియన్‌గా అనంతపురం జిల్లా జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో కర్నూలు, చిత్తూరు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో గుంటూరు, బాలికల విభాగంలో నెల్లూరు జిల్లాలు విజేతలుగా నిలిచాయి.

బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వీరే..

బాలుర విభాగం : టి.జయసింహ, ఎస్.దర్శన్‌తేజ్, డి.యశ్వంత్, ఎం.విక్రాంత్, ఎస్.మిరాజ్(అనంతపురం), ఎం.వినోద్‌కుమార్(గుంటూరు), ఎం.జాకీర్ అహ్మద్(కృష్ణ) ఉన్నారు. అలాగే బాలికల విభాగంలో ఎ.ఎక్షయని, ఎస్.మీరాజాస్మిన్, బి.నాగశ్వేత, బి.ప్రవళిక, బి.కావ్య(అనంతపురం), సి.భావన, జి.పూజిత(చిత్తూరు) ఉన్నారు.

రేపటి నుంచి అండర్ 14, 17 క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 23: ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు అండర్ 14, 17 విభాగాలలో నియోజకవర్గ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎస్.నజీమా, మండల కో-ఆర్డినేటర్ శోభన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న తుమ్మలగుంట మైదానంలో అథ్లెటిక్స్, 27న ఎమ్మార్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో కబడ్డీ, ఖోఖో, 28నవాలీబాల్, యోగా, చెస్, 30న పీయూటీసీ అకాడమీలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉంటాయని వెల్లడించారు. అండర్ 14కు 2011 జనవరి ఒకటి తర్వాత, అండర్ 17కు 2008 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎజీఎఫ్ మానిటరింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9490620292ను సంప్రదించాలని కోరారు.

తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈవోగా జయకుమార్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 23: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎ.జయకుమార్(గ్రేడ్ 2)ను నియమిస్తూ దేవదాయశాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఈవో మమతను బదిలీ చేశారు. అలాగే కండల గోవిందాచార్యుల ట్రస్టు ఈవోగా పి.రామకృష్ణారెడ్డి(గ్రేడ్ 1), గ్రూప్ టెంపుల్స్ ఈవోగా ఈ.మునిశేఖర్(గ్రేడ్ 2), గాలిగోపురం మఠం ఈవోగా వి.మునికృష్ణమూర్తి(గ్రేడ్ 2) నియమించారు.

తిరుపతి


కలెక్టరేట్ వద్ద ఏఎన్ఎంలు


అర్జీదారుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న బీఎన్‌కండ్రిగ వెస్ట్ వరత్తూరు దళితులు - స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందస్తున్న రేషన్ డీలర్లు

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 224 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులో పు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి పెద్దయెత్తున అర్జీదారులు వచ్చి వినతులు సమర్పించారు. 224 వినతులు అందగా అత్యధికంగా భూ సమస్యలపై 144 వచ్చాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, సెప్షల్ డిప్యూటీ కలెక్టర్లు చంద్రశేఖర్‌నాయుడు, రామ్మోహన్ అర్జీలు స్వీకరించారు.

పని ఒత్తిడి తగ్గించండి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోందని ఏపీ హంస సంఘం జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వైద్యశాఖవే కాకుండా ఇతర శాఖల విధులు కూడా తమకు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దళితుల భూముల్లోకి చొరబడుతున్నారు

తమకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లోకి అగ్రవర్ణాల వారు చొరబడుతున్నారని బీఎన్‌కండ్రిగ మండలం వెస్ట్‌వరత్తూరు దళితులు తెలిపారు. భూములను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని డీఆర్వో పెంచలకిషోర్‌కు విన్నవించారు.

మా స్థలంలో రోడ్డు వేశారు


సరస్వతి

పూర్ణకుంభం సర్కిల్ నుంచి చింతలచేను వరకు మున్సిపల్ శాఖ గతంలో రోడ్డు వేసిందని, పక్కనే ఉన్న తమ 40 అంకణాల స్థలంలో 20 అంకణాలు అందులో పోయిందని, నోటీసు ఇవ్వకుండానే రోడ్డు వేయడమే కాకుండా కనీసం పరిహారం ఇవ్వలేదని బైరాగిపట్టెడకు చెందిన సరస్వతి అధికారుల దృష్టికి తెచ్చారు. పక్క స్థలం వారు మిగిలిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించింది.

న్యాయం చేయండి

రేషన్ షాపుల పునరుద్ధరణలో అందరికీ సమన్యాయం చేయాలని రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు కోరారు. నిబంధనల ప్రకారం రేషన్‌కార్డుల పునరుద్ధరణ చేసి, ఆదుకోవాలని జిల్లా నాయకులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడుకు మొర పెట్టుకున్నారు. జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి సాల్మన్‌రాజు, హేమలత, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 23: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 103 అర్జీలు రాగా, పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు వాటిని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వ్యక్తితో ఆప్యాయంగా మాట్లాడి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి పంపారు. కాగా, అర్జీలు సమర్పిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేయడం కనిపించింది.


ఆరోగ్యం సరిగా లేని వ్యక్తితో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి ప్రశాంతతకు వంద రోజులు

- 'ఇది మంచి ప్రభుత్వం'లో టీడీపీ నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో తిరుపతి ప్రశాంతంగా ఉందని, గత ప్రభుత్వ ఘోరాల తాలూక వివాదాలు తప్ప మరే విషయంలోనూ ఎక్కడా ఇబ్బంది లేదని టీడీపీ నేతలు అన్నారు. సంజయ్ గాంధీ కాలనీలోని శ్రీరాముల ఆలయం వద్ద ప్రజావేదిక పేరిట ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సోమవారం సాయంత్రం జరిగింది. కార్పొరేషన్ డీసీ అమరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. వంద రోజుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల చేత మంచి ప్రభుత్వం అనిపించుకుందని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు దక్కిందన్నారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ మాట్లాడుతూ టీటీడీ, కార్పొరేషన్, తుడాలో వైసీపీ నేతలు చేసిన అవినీతి అక్రమాలు సాక్షాధారాలతో సహా తమ వద్ద ఉన్నాయని, వైసీపీ నేతలను ప్రజలు తిరస్కరించినా బుద్ధి రాలేదని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ , టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, చిట్టిబాబు, జేబి రఘు, అన్నా అనిత, గంజి సుధాకర్ రెడ్డి, బ్యాంక్ శాంతమ్మ, జనసేన నేతలు రాజా రెడ్డి, హేమంత్, పురుషోత్తం, సాయి, రవి అయ్యప్ప రాయల్ పాల్గొన్నారు.

ఆస్పత్రులను సేఫ్ జోన్‌గా ప్రకటించాలి


వైద్య విజ్ఞాన అధ్యయన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 23 : దేశంలోని ఆస్పత్రులకు ఒకే రక్షణ చట్టం ఉండాలని, వాటిని సేఫ్ జోన్‌గా ప్రకటించాలని, సింగిల్ విండో అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం కోరారు. తిరుపతిలోని ఓ హోటల్లో సోమవారం తిరుపతి ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) శాఖ నిర్వహించిన నెలవారీ వైద్య విజ్ఞాన అధ్యయన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రైవేటు ఆస్పత్రులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆరోగ్యశ్రీ బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించడంతోపాటు ప్రస్తుతం ఇస్తున్న టారిఫ్‌ను పెంచాలన్నారు. ఫైర్ ఎన్‌వోసీని ఐదేళ్లకు ఇవ్వాలని కోరారు. రష్ ఆస్పత్రి యూరాలజిస్టు డాక్టర్ కీర్తి సాగర్‌రెడ్డి కిడ్నీలో రాళ్ల గురించి, అత్యవసర వైద్యం గురించి డాక్టర్ పవన్ వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, తిరుపతి బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్, ఐఎంఏ నేతలు సుబ్రహ్మణ్యం, హరికుమార్‌రెడ్డి, వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 23: నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగించినట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తులు సమర్పించడానికి అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తుల గురించి సమాచారం కోసం విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8688888802, 9399976999లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

యూత్ ఫెస్టివల్ విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల ఒకటో తేదీన నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో విజేతలకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ నగదు బహుమతులు అందించారు. 5కే రన్ మారథాన్ పురుషుల విభాగంలో చరణ్‌కుమార్‌కు మొదటి బహుమతి కింద రూ.7వేలు, రెండో బహుమతిగా జి.రాజాకు రూ.4వేలు, మహిళల విభాగంలో వీకే సాయిప్రియకు రూ.7వేలు, ద్వితీయ స్థానం సాధించిన రజనీకి రూ.4వేలు అందజేశారు. ట్రాన్స్‌జెండర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన స్వీటీకి రూ.7వేలు, తేజస్వినీకి రూ.4వేలు అందజేశారు. రెడ్ రిబ్బన్ క్విజ్ ప్రోగ్రామ్‌లో మొదటి బహుమతిగా ఏర్పేడు మండలం బండారుపల్లి .జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన చెంచమ్మకు రూ.7వేలు, తిరుపతి డాక్టర్ ఎస్ఆర్‌కేఎం హైస్కూల్ విద్యార్థిని రాధికకు రూ.3,500 అందజేశారు. రెండవ బహుమతిగా రేణిగుంట జడ్పీ పాఠశాలకు చెందిన హాసినికి రూ.5వేలు, ప్రియదర్శినికి రూ.2,500 చెక్కు అందజేశారు. జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఈవో శేఖర్ పాల్గొన్నారు.

మాక్‌కు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు


గుర్తింపు పత్రంతో బాలసుబ్రమణ్యం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 23: తిరుపతికి చెందిన ట్రెక్కింగ్ బృందం మొజాక్ అడ్వెంచర్ కమ్యూన్ (మాక్)కు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. మాక్ వ్యవస్థాపకులు బి.బాలసుబ్రమణ్యంకు ఇటీవల జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం, పతకం అందజేసి, సత్కరించారు. మాక్ తిరుపతి పరిసరాలలో 155 వారాల ట్రెక్కింగ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించింది. ట్రెక్కింగ్‌కు సంబంధించిన పుస్తకాలను ప్రచురించింది. ఫొటో ప్రదర్శనలు నిర్వహించింది. ఈ సేవలకు గాను మాక్ ఇదివరకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు వంటి పదికి పైగా ప్రఖ్యాత పురస్కారాలను అందుకుంది. బాలసుబ్రమణ్యంను ప్రకృతి ప్రేమికులు, ట్రెక్కర్స్ అభినందించారు.

దూరవిద్య పరీక్షలు నిర్వహించండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23: ఎస్వీయూ దూరవిద్య పరీక్షలు నిర్వహించాలని ఇన్‌చార్జి వీసీ అప్పారావుకు బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారాయణగౌడ్ విన్నవించారు. పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహించి వారి భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు.

మహిళా సిబ్బందిని క్షమాపణ కోరిన మెడికల్ ఆఫీసర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 23 : ఆస్పత్రిలోని మహిళా సిబ్బందిని అసభ్యకర పదజాలాలతో దూషించి వాట్సాప్ గ్రూపుల్లో అసభ్యకర సందేశాలు పెట్టినందుకు నెరబైలు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణచైతన్య క్షమాపణ కోరాడు. మద్యం మత్తులో విధులకు హాజరవడమే కాకుండా ఆస్పత్రిలోని మహిళా సిబ్బందిని అసభ్యకరమైన పదజాలాలతో దూషిస్తూ రాత్రిళ్లు వాట్సాప్ గ్రూపుల్లో మెసేజులు పెడుతున్న విషయంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో మెడికల్ ఆఫీసర్ వేధింపుల నుంచి రక్షణ కల్పించండి శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నెరబైలు గ్రామస్థులు, పాలకులు సోమవారం ఆస్పత్రిలో ఆయన్ను నిలదీశారు. దీంతో తప్పు ఒప్పుకొని మరోసారి ఇలా చేయనని చెప్పారు. మహిళా సిబ్బందిని క్షమాపణ కోరారు.

ఎస్వీయూ అడ్మిషన్ల విభాగ డైరెక్టర్‌గా రమేష్ బాబు


నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23: ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఊకా రమేష్ బాబు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ డైరెక్టర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ శ్రీమురళి స్థానంలో ఆయన్ను నియమించారు. ఇందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చెంగ్రాయుడు అందజేసి, అభినందించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అడ్మిషన్లు పారదర్శకంగా చేపట్టి యూనివర్సిటీ ఉన్నతి కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్టు చేయాలి


ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలను చించి దళిత డాక్టర్‌ను విద్యార్థుల ఎదుట అవమానపరిచి, కొట్టి గాయపరిచిన ఎమ్మెల్యేలు రఘురామకృష్ణమరాజు, నానాజీలను వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి అంబేడ్కర్ భవన్ ఎదుట వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. అంతకుముందు భవన్ నుంచి పూలే విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రజా సంఘాల నేతలు పరమశివన్, నాగేశ్వరరావు, ఎం.ప్రసాదరావు, పున్నాగ సురేష్, సి.రెడ్డెప్ప మాట్లాడుతూ బ్యాంకుకు రూ.3,600 కోట్లు ఎగ్గొట్టి ఐపీ పెట్టిన రఘురామకృష్ణరాజు, నానాజీలు అంబేడ్కర్ ఫ్లెక్సీని చించడం దారుణమన్నారు. దళితులను నీచంగా మాట్లాడిన వారిద్దరికి 2029 ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. నేతలు స్టార్ కృష్ణ, రఘురాం రాధాకృష్ణ, రాజేష్, ధనశేఖర్, రామమూర్తి, గురవయ్య, బిట్టు, భోగం రమేష్, వాసు, గోపీ, రిగి, పవన్ పాల్గొన్నారు.

తిరుపతిలో భారీ వర్షం

తిరుపతి అర్బన్/లీలామహల్, సెప్టెంబరు 23: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం సాయంత్రం తిరుపతిలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ ఏరులను తలపిస్తూ ప్రవాహం సాగింది. కపిలతీర్థం, లీలామహల్ నుంచి కరకంబాడి మార్గంలోని మాధవనగర్, బొంతాలమ్మగుడి, వెంకటేశ్వరకాలనీ, కొండా కల్యాణ మండపం ప్రాంతాల్లో రోడ్లపై భారీగా నీరు నిలిచింది. పూలవానిగుంట, తుడా రోడ్డుల్లోనూ నీరు నిలిచింది. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. అండర్ బ్రిడ్జిలలో నీరు నిలవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఇందిరా ప్రియదర్శిని కూరగాయాల మార్కెట్ మురికి నీటితో నిండిపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థపడ్డారు. ఆర్టీసీ బస్టాండులోనూ అదే పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. ముందుజాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మూడు రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది.


ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలిచిన నీరు


తుడా రోడ్డులో నిలిచిన నీరు

నేడు ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23: ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా ఎస్వీయూ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపడుతున్నట్టు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని కాలేజీలు, బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలిగించాలని కోరారు.

భార్య, బంధువులపై భర్త దాడి

దొరవారిసత్రం, సెప్టెంబరు 23: దొరవారిసత్రం మండలం సింగనాలత్తూరు దళితవాడలో ఎర్రబోతు కల్యాణ్ తన భార్య కోటమ్మను ఆదివారం రాత్రి చితకబాదాడు. అడ్డు వచ్చిన అత్త మస్తానమ్మను కొట్టి గాయపరిచాడు. ఈ ఘటనలో తల్లీ కూతుళ్లకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకొన్న కోటమ్మ సోదరులు కారికాడు గ్రామానికి చెందిన నవీన్, హరిబాబు సింగనాలత్తూరు గ్రామానికి చేరుకుని కల్యాణ్‌ను నిలదీశారు. మద్యం మత్తులో ఉన్నం కల్యాణ్ నవీన్, హరిబాబుపై మచ్చు కత్తితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో గాయపడిన నవీన్, హరిబాబును తిరుపతికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. తనతో పాటు తల్లి, సోదరులపై దాడికి పాల్పడిన కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని కోటమ్మ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఎమ్మెల్యే ఫ్లెక్సీలచించివేతపై ఫిర్యాదు

గూడూరు, సెప్టెంబరు 23: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో సోమవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్ర మానికి విచ్చేసిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు మండల టీడీపీ నాయకులు స్వాగతం పలుకుతూ పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆదేరోజు రాత్రి గ్రామానికి చెందిన కొందరు ఆ ఫ్లెక్సీలను చించివేశారు. సోమవారం ఉదయం టీడీపీ నాయకులు గుర్తించిన గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలను చించివేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అండర్ 14 జూడో పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జూడో అండర్ 14 విభాగం బాలబాలికలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 23: అండర్ 14 జూడో రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన ఏడుగురు చొప్పున బాలబాలికలు జాతీయ స్థాయికి ఎంపి కయ్యారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో రెండు రోజుల పాటు 68వ ఎస్జీఎఫ్ అంతర్ జిల్లాల జూడో అండర్ 14 పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏడు కేటగి రీలలో ఓవరాల్ ఛాంపియన్‌గా అనంతపురం జిల్లా జట్టు నిలవగా, ద్వితీయ స్థా నంలో కర్నూలు, చిత్తూరు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగం లో గుంటూరు, బాలికల విభాగంలో నెల్లూరు జిల్లాలు విజేతలుగా నిలిచాయి.

బంగారు పతకాలు సాధించి క్రీడాకారులు వీరే..

బాలుర విభాగం: టి.జయసింహ, ఎస్.దర్శన్‌తేజ్, డి.యశ్వంత్, ఎం.విక్రాంత్, ఎస్.మిరాజ్(అనంతపురం), ఎం.వినోద్‌కుమార్(గుంటూరు), ఎం.జాకీర్ అహ్మద్(కృష్ణ) ఉన్నారు. అలాగే బాలికల విభాగంలో ఎ.ఎక్షయని, ఎస్.మీరాజాస్మిన్, బి.నాగశ్వేత, బి.ప్రవళిక, బి.కావ్య(అనంతపురం), సి.భావన, జి.హూజిత(చిత్తూరు) ఉన్నారు.

రేపటి నుంచి అండర్ 14, 17 క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 23: ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు అండ ర్ 14, 17 విభాగాలలో నియోజకవర్గ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎస్.నజీమా, మండల కో-ఆర్డినేటర్ శోభన్‌బాబు సోమవారం ఒక ప్రక టనలో తెలిపారు. 25న తుమ్మలగుంట మైదానంలో అథ్లెటిక్స్, 27న ఎమ్మార్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో కబడ్డీ, ఖోఖో, 28నవాలీబాల్, యోగా, చెస్, 30న పీయూబీసీ అకాడమీలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉంటాయని వెల్లడించారు. అండర్ 14కు 2011 జనవరి ఒకటి తర్వాత, అండర్ 17కు 2008 జనవరి ఒకటి తర్వాత జన్మిం చిన వారు అర్హులని తెలిపారు. ఎజీఎఫ్ మానిటరింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9490620292ను సంప్ర దించాలని కోరారు.

యూత్ ఫెస్టివల్ విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల ఒకటో తేదీన నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో విజేతలకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ నగదు బహుమతులు అందించారు. 5కే రన్ మారథాన్ పురుషుల విభాగంలో చరణ్‌కుమార్‌కు మొదటి బహుమతి కింద రూ.7వేలు, రెండో బహుమతిగా జి.రాజాకు రూ.4వేలు, మహిళల విభాగంలో వీకే సాయిప్రియకు రూ.7వేలు, ద్వితీయ స్థానం సాధించిన రజనీకి రూ.4వేలు అంద జేశారు. ట్రాన్స్‌జెండర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన స్వీటీకి రూ.7వేలు, తేజస్వినీకి రూ.4వేలు అందజేశారు. రెడ్‌రిబ్బన్ క్విజ్ ప్రోగ్రామ్‌లో మొదటి బహు మతిగా ఏర్పేడు మండలం బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన చెంచమ్మకు రూ.7వేలు, తిరుపతి డాక్టర్ ఎస్ఆర్‌కేఎం హైస్కూల్ విద్యార్థిని రాధికకు రూ.3,500 అందజేశారు. రెండవ బహుమతిగా రేణిగుంట జడ్పీ పాఠ శాలకు చెందిన హాసినికి రూ.5వేలు, ప్రియదర్శినికి రూ.2,500 చెక్కు అంద జేశారు. జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఈవో శేఖర్ పాల్గొన్నారు.

27న చంద్రగిరి కోటలో సౌండ్స్, లైట్స్ షో ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27న చంద్రగిరి కోటలో సౌండ్స్ అండ్ లైట్స్‌షోను సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పర్యాటక శాఖ, లక్స్ అండ్ డెసిబెల్స్ ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.6 కోట్లతో లైట్స్ అండ్ సౌండ్‌షోను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణ ప్రసాద్, ఏపీటీడీసీ డీవీఎం గిరిధర్‌రెడ్డి, ఈఈ సుబ్రహ్మణ్యం, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ప్రకటించింది. ఆదివారం 82,436 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

11 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఒకరి అరెస్టు


స్మగ్లర్ అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంగళం, సెప్టెంబరు 23: పీలేరు - భాకరాపేట మార్గంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం 11 ఎర్రచందనం దుంగలతో పాటు రెండు కార్లు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐలు విష్ణువర్ధన్‌కుమార్, సురేష్‌బాబు పీలేరు -భాకరాపేట ప్రధాన మార్గంలోని ఎలమంద్ర క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులను చూసి రెండు కార్లు దూరంగా ఆగాయి. అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. పైలెట్లుగా వాడుకున్న రెండు మోటారు సైకిళ్లను, కార్లను స్వాధీనం చేసు కున్నారు. నిందితుడు తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునాపుత్తూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కర్మాగారంలో పొగలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23: నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని ఎకోబిట పరిశ్రమలో చిమ్నీ పేలి కర్మాగారమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. హుటాహుటిన కంపెనీ యాజమాన్యం సమస్యను గుర్తించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టింది. సాంకేతిక లోపంతో ఈ సంఘటన చోటుచేసుకుందని తెలిపారు. ఈ ఘటనలో కార్మికులకు ఎటువంటి గాయాలు కాలేదు.

మట్టి ట్రాక్టర్ స్వాధీనం

కోట, సెప్టెంబరు 23: మండల పరిధిలోని పెన్నక్క చెరువులో నుంచి అనుమతి లేకుండా మట్టి తరలి స్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. టాక్టర్‌ను మైనింగ్‌శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతర ఏర్పాట్లలో అలసత్వం వద్దు: కురుగొండ్ల


జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

వెంకటగిరి, సెప్టెంబరు 23: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లలో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పింజలవీరయ్య కల్యాణ మండపంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి జాతర నిర్వహణపై అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో ఏ శాఖ అధికారులు ఏ బాధ్యతలు స్వీకరించారో అడిగి తెలుసుకొన్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకోవాన్న ఉద్దేశంతోనే వీవీఐపీ పాసులను కూడా రద్దు చేయం జరిగిందన్నారు. ఈసందర్భంగా త్రిభవని సినిమా థియేటర్ యజమాని ప్రభాకర్ అమ్మవారి బంగారు పాదుకల తయారీకి రూ.లక్ష విరాళం అందచేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ, ఎంపీపీ తనూజారెడ్డి, సబ్‌కలెక్టర్ వీరరాఘవ మీనా, ఏఎస్పీ రవిమనోహర్ ఆచారి, డీఎస్పీ రమణకుమార్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై ఎస్పీ ఆరా

పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై ఎస్పీ సుబ్బరాయుడు ఆరా తీశారు. జీనిగల వారివీధిలోని అమ్మవారి అత్తవారి ఇల్లుగా భావించే చాకలింట వద్ద, కుమ్మరి వీధిలోని అమ్మవారి పుట్టి నిల్లుగా భావించే కుమ్మరింటి వద్ద బారికేడ్ల ఏర్పాట్లు, అమ్మవారి దర్శన క్యూలైన్లు, నిరూప మండపం వద్ద బందోబస్తు ఏర్పాట్లు, అమ్మవారు చప్రం తిరిగే మార్గాలను పరిశీలించారు. అక్కడ చేపట్టే ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకుని, పోలీసులకు తగు సూచనలు ఇచ్చారు.

దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 23: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీల్లో భాగంగా దీపావళి పండుగ నుంచి ఏడాదికి మూడు గ్యాస్ సిలండర్లను ఉచితంగా అందించే పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. సోమ వారం గూడూరు మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజావేదిక సభ ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పనీ జరగలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకోవడమే కాకుండా కలియుగ దైవం వెంకన్న స్వామి పవిత్ర ప్రసాదమైన లడ్డూలోనూ భారీ అవినీతికి పాల్పిడి అపచారం చేసి భక్తులను మోసం చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఫించన్లను వెయ్యి రూపాయలు పెంచి రూ.4 వేలుగా ఒకటో తేదీ నాడే లబ్ధిదారుల ఇంటికి నేరుగా అందజేస్తున్నారని కొనియాడారు. అలాగే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజలకు ఆస్తులకు రక్షణ కల్పించిందన్నారు. పేదలకు రూ.5కే ఆకలి తీర్చేలా అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని వివరిం చారు. అనంతరం 'పొలం పిలుస్తోంది' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటే శ్వర్లు రాజు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తిరుపాల్, దుద్దా రాఘవ రెడ్డి, నంబూరు వెంకటే శ్వర్లు నాయుడు, శివకుమార్, రమణ య్య, జనార్దన్‌రెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వర రావు, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, వివిధశాఖల అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా చంద్రన్న ప్రభుత్వం: కురుగొండ్ల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, సెప్టెంబరు 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కడగుంట గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూట మి ప్రభుత్వ వంద రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్ర మాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో పవిత్రమైన తిరుమల లడ్డూలో కల్తీనెయ్యిని వినియోగించి అపచారానికి పాల్పడిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రే స్వయంగా వరదలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించారన్నారు. సెలవుదినాల్లో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారుల చేత పనిచేయించడం హర్షణీయమన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటిసారిగా కడగుంటకు వచ్చిన కురుగుండ్లను టీడీపీ నాయ కులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్య క్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎంపీడీవో వినీల్‌కుమార్, డీటీ శిరీషా, నాయకులు రాయి మస్తాన్‌నాయుడు, కూను శ్రీహరి, రాయి సత్యం నాయుడు, చిత్తూరు ఈశ్వరయ్య, బూతు ప్రసన్నకుమార్, సీసీ నాయుడు, కొప్రపాటి రామచంద్రనాయుడు, వేళ్ల సురేంద్రరెడ్డి, హఫీజ్, చిత్తూరు పద్మనాభం, మన్నెమాల గోపీకృష్ణారెడ్డి, తాల్లూరు ప్రసాద్ నాయుడు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి



గూడూరు, సెప్టెంబరు 23: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన పంటా శ్రీనివాసులు రెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం సోమవారం నియమించింది. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తాన చెప్పారు. తనకు ఈ పదవి అప్పగించిన రాహుల్‌గాంధీ, వేణుగోపాల్, వైఎస్ షర్మిలకు ధన్యవాదాలు తెలిపారు.

సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 23: వరద బాధితుల సహాయార్థం గాయత్రి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు రూ.53వేల చెక్కును సీఎం సహాయనిధికి అందజేశారు.

నిధుల దుర్వినియోగంపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

వాకాడు, సెప్టెంబరు 23: మండలంలోని నిడిగుర్తి పంచాయతీ సర్పంచు మల్లాపు నాగరాజు నిధులు దుర్వినియోగం చేశా రంటూ టీడీపీ నాయకులు రమణయ్య, ధనంజయ, నాగరాజు, సుబ్రహ్మణ్యం తదిత రులు సోమవారం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత మూడున్నరేళ్లుగా జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించకుండా, ఎలాంటి తీర్మానం లేకుండా సర్పంచు రూ.6,33,953 నగదు, 640 బస్తాల సిమెంట్ దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23: నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి సమీపంలోని టీ దుకాణంలో అక్రమంగా నిల్వచేసిన 33 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఎస్పీ కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 23: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 103అర్జీలు రాగా, పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు వాటిని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వ్యక్తితో ఆప్యాయంగా మాట్లాడి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి పంపారు.

నాయుడుపేట కమిషనర్‌గా ఫజులుల్లా



నాయుడుపేట, సెప్టెంబరు 23: నాయుడుపేట మున్సిపల్ కమిష నర్‌గా షేక్ ఫజులుల్లా నియమితుల య్యారు. ఇక్కడ పనిచేస్తున్న జనార్దన రెడ్డి పీఆర్ అండ్ ఆర్డీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు మున్సి పల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఫజులుల్లాను ఇక్కడకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్పీడీసీఎల్ ఈఈగా శ్రీనివాసులు



నాయుడుపేట, సెప్టెంబరు 23: ఎస్పీడీసీఎల్ నాయుడుపేట డివిజన్ ఈఈగా వై.శ్రీనివాసులు నియమితు లయ్యారు. ఇక్కడ ఈఈగా పని చేస్తున్న ప్రసన్నకుమార్ పదవీ విర మణ చేశారు. దీంతో పులివేంద్రంలో పనిచేస్తున్న శ్రీనివాసులును ఇక్కడకు బదిలీ చేయడంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు.

చెంగాళమ్మ ఆలయ ఈవోగా ప్రసన్నలక్ష్మి



సూళ్లూరుపేట, సెప్టెంబరు 23: చెంగాళమ్మ ఆలయ ఈవోగా (సహాయ కమిషనర్) ప్రసన్నలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరులో దేవదాయశాఖ ఏసీగా ఉన్న ఈమెను చెంగాళమ్మ ఆలయా నికి బదిలీ చేశారు.

ఏపీటీగా స్వాతిరెడ్డి

కోట, సెప్టెంబరు 23: కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా స్వాతిరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. నాయుడుపేట నుంచి స్వాతిరెడ్డి ఇక్కడ బదిలీపై రాగా, ఇక్కడ ఏపీపీగా పనిచేస్తున్న కేదార్‌నాథ్ నాయుడుపేటకు బదిలీపై వెళ్లినట్లు న్యాయవాదులు తెలిపారు.

కడప జోన్ ఆర్టీసీ ఈడీ బదిలీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 23: కడప జో న్ ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మా డి చెంగల్‌రెడ్డి విజయవాడ ప్రధాన కార్యాల యానికి బదిలీ అయ్యారు. ఇటీవల ఆయన ప దోన్నతిపై కడప జోన్ ఈడీగా బాధ్యతలు చే పట్టిన విషయం తెలిసిందే. వారం వ్యవధిలోనే బదిలీ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైం ది. కడప జోన్ ఈడీగా పి.చంద్రశేఖర్, చిత్తూ రు డీపీటీవోగా జగదీష్‌లను నియమించారు. వాకాడు, కుప్పం డిపో మేనేజర్లుగా పెంచల య్య, గోపీనాథ్, శ్రీకాళహస్తి ఇన్‌చార్జి డీఎంగా తిరుపతి డిపో మేనేజర్ టి.బాలాజీలను నియ మించారు. తిరుపతి డీపీటీవో పోస్టును ఖాళీ గా ఉంచారు.

తిరుమల ఘాట్‌లో అదుపు తప్పిన జీపు

తిరుమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్ రోడ్డులో సోమవారం ఓ జీపు అదుపు తప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. ఏపీ 39 వీప 1006 నంబరు గల జీపులో ఆరుగురు భక్తులు తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరారు. ఆరో కిలోమీటరు వద్ద అదుపుతప్పి ఎడమ వైపు క్రాష్‌బారియర్‌ను ఢీకొంది. వాహనంలోని భక్తులకు ఎలాంటి ఇబ్బందీ జరగలేదు.

స్వర్ణాంధ్ర 2047 పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: స్వర్ణాంధ్ర 2047 పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమ వారం అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, ఎస్డీసీలు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లతో సృజనాత్మకత

నాయుడుపేట, సెప్టెంబరు 23: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు సైన్స్‌ఫేర్‌లు ఎంతగానో దోహదపడుతాయని డిప్యూటీ ఈవో శాంతి అన్నారు. నాయుడుపేట ఎల్ఏ సాగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్‌ఫేర్ మాంక్ వర్క్‌షాపు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలు సరళీకృతంగా అర్థమయ్యేందుకు ప్రయోగాల ద్వారా వివరించాలన్నారు. సైన్స్‌ఫేర్‌లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో విద్యాభ్యాసాలపై ఆసక్తి పెరిగి మంచి ప్రయోగాలు చేయగలు గుతారన్నారు. సైన్స్‌ఫేర్ మాంక్ వర్క్‌షాపులో ఉమ్మడి గూడూరు డివిజన్ పరిధిలో 150 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జాతీయస్థాయిలో ఇన్‌స్పైర్ ప్రాజెక్టులో పారిశుధ్య కార్మికులు శుభ్రపరిచే ఆధునిక పరికరాలను ప్రదర్శించిన దొరవారిసత్రం మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, జిల్లా సైన్స్ ఆఫీసర్ భానుప్రసాద్, హెచ్ఎం అన్నామణి, కోఆర్డినేటర్ రివేష్, రవి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


శ్రీనివాసులును సన్మానిస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

చిల్లకూరు, సెప్టెంబరు 23: జిల్లాస్థాయి ఉత్తమ వ్యాయమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసులును పాఠశాల సిబ్బంది సోమవారం సన్మానిం చారు. హెచ్ఎం జాన్‌పీటర్ మా ట్లాడుతూ పీడీ శ్రీనివాసులు శిక్షణలో ఎంతోమంది విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై రాణించారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం కోదండరామ్, ఉపాధ్యాయులు శ్రీని వాసులు, శంకరయ్య, మల్లికార్జున్, చంద్ర, జానకిరామయ్య, శిరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన

చిల్లకూరు, సెప్టెంబరు 23: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలుగు రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి అన్నారు. సోమవారం మండలంలోని ఓడూరు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందరోజుల కూటమి పాలనతో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కీరవాణి, రాఘవులు, పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏకొల్లును అభివృద్ధి చేస్తాం: విజయశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, సెప్టెంబరు 23: దొరవారిసత్రం మండలం ఏకొల్లును అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. సోమవారం ఏకొల్లులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు గ్రామంలో సరైన తాగునీటి వసతి లేదని, గిరిజనుల గృహాలు ఉరుస్తున్నట్లు తెలిపారు. అలాగే సర్వే నెంబరు 463లో 20 ఏళ్ళ క్రితం పట్టాలు ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు భూములు చూపించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం మాట్లాడుతూ తిరుమల లడ్డూకు విని యోగించే నెయ్యి కల్తీపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించి దోషులు శిక్ష పడేలా చూస్తుందన్నారు. కేవలం కమీషన్ల కక్కుర్తితో నెయ్యి కల్తీకి పాల్పడినట్లు విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచు ఆవుల బ్లసీ, తహసీల్దారు శైలాకుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, నాయకులు పామంజి శ్రీనివా సులు, శ్రీహరిరెడ్డి, రత్నయ్య, కిషోర్ నాయుడు, రమణయ్య, ఉదయ్‌కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి టీడీపీ అండగా నిలుస్తుంది


మస్తాన్‌నాయుడికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 23: టీడీపీ బలోపేతానికి కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక నిమ్మ మార్కెట్‌లో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఆరికట్ల మస్తాన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. మస్తాన్ నాయుడుకు పుట్టిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మస్తాన్‌నాయుడు మొదటి నుంచి టీడీపీలో ఉంటూ పార్టీ కోసం ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, బెజవాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో ఘర్షణ: ఒకరికి తీవ్ర గాయాలు

దొరవారిసత్రం, సెప్టెంబరు 23: మండలంలోని మోదుగులపాళెంలో ఆదివారం రాత్రి రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయా లయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... మోదుగులపాళెం పాత హరిజన వాడకు చెందిన మాయారి సాయిచందుతో పాత కక్షల కారణంగా సురేష్, మాధవ్, మునిశేఖర్, మునిచంద్ర గొడవ పడ్డారు. సాయిచందు చిన్నాన్న మాయారి సుబ్రహ్మణ్యం సర్దుబాటు చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో సాయిచందును మాధవ్ కత్తితో నరకబోయాడు. సాయిచందు తప్పించుకోగా, ఆ కత్తి పక్కనే ఉన్న సుబ్రహ్మణ్యానికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సురేష్ బృందం అక్కడ నుంచి పారిపోయింది. గాయపడిన సుబ్రమణ్యంను స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

నెల్లూరు మైనింగ్ డీడీగా చంద్రశేఖర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 23: నెల్లూరు జిల్లా మైనింగ్ శాఖ డీడీగా ఎన్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న శ్రీనివాసకుమార్‌ను విజయవాడ డీడీగా బదిలీ చేసింది. కాగా, గూడురు సబ్ డివిజన్ ఏడీగా ఉన్న రంగకుమార్ అన్నమయ్య జిల్లా మదనపల్లికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో పార్వతీపురం నుంచి కే.శ్రీనివాస్ నియమి తులయ్యారు. నెల్లూరు మైనింగ్ ఆర్ఐగా ఉన్న దేవి సింగ్‌ను అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి సీహెచ్.స్వాతిని నియమించారు. గూడూరు ఏజీ నరేష్‌ను తిరుపతికి బదిలీ చేయగా, అనకాపల్లి నుంచి టీ.సుబ్బరాయుడును ఆయన స్థానంలో నియ మించారు. గూడురు ఆర్ఐగా ఉన్న గంగాధర్‌ను ఇబ్రహీంపట్నంకు, అక్కడున్న ఎం.బాలమురళిని గూడురుకు బదిలీ చేశారు.

జిల్లా పరిషత్‌లో భారీగా బదిలీలు

20 మంది ఎంపీడీవోలకు స్థానచలనం

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 23: నెల్లూరు జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోల నుంచి కార్యాలయ సబార్డినేటర్స్ వరకు 272మందిని బదిలీ చేస్తూ కలెక్టరు ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 20మంది ఎంపీ డీవోలు, 27 మంది ఏవోలు, 44 మంది సీనియర్ అసిస్టెంట్లు, 71 మంది జూనియర్ అసిస్టెంట్లు, 22మంది టైపిస్టులు, 26మంది గ్రంథాలయ అసిస్టెంట్లు, 62 మంది కార్యాలయ సబార్డినేటర్స్ ఉన్నారు.

బదిలీ అయిన ఎంపీడీవోలు వీరే!

ఎంపీడీవో	ప్రస్తుతం స్థానం	బదిలీ అయిన స్థానం
ఎం.శ్రీహరి	కోవూరు	బుచ్చిరెడ్డిపాళెం
కె.ప్రత్యూష	ముత్తుకూరు	కలిగిరి
ఎం.బ్రహ్మయ్య	కొండాపురం	జలదంకి
ఎ.మధుసూదన రావు	అనంతసాగరం	గూడూరు
జి.వెంకటేశ్వర్లు	మనుబోలు	దగదర్తి
ఎం.భవాని	కోట	రాపూరు
ఎ.ప్రమీలా రాణి	సూళ్లూరుపేట	పెళ్లకూరు
ఎం.భాస్కర్	సెలవుల్లో..	ఎస్ఆర్ పురం
కె.వెంకటేశ్వర రావు	గూడూరు	టీపీ గూడూరు
కె.సురేష్‌బాబు	పెళ్లకూరు	నాయుడుపేట
పి.ప్రసన్నకుమారి	దక్కిలి	ఏస్‌పేట
కె.గోవర్ధన్	కలువాయి	డీవీ సత్రం
వి.రజినీ కాంత్	ఓజిలి	అల్లూరు
ఈవి.నరసింహారావు	బుచ్చిరెడ్డిపాళెం	పొదలకూరు
ఏపీ సుబ్బారావు	బోగోలు	కొడవలూరు
పి.సుబ్రహ్మణ్యం	కొడవలూరు	బోగోలు
కె.షాలేట్	చిట్టమూరు	సంగం
పి.నాగమణి	మర్రిపాడు	ముత్తుకూరు
టి.నాగేష్‌కుమారి	పొదలకూరు	విడవలూరు
వివి.సూర్యసాయి	చిల్లకూరు	వాకాడు

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం


దుర్గిపేరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఏర్పేడు, సెప్టెంబరు 23: ప్రజా సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరిలో ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తాము అనేక సమస్యలను ఎదుర్కొన్నారని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే... సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వందరోజులు పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అనేక సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం శ్రీకాళహస్తిలో అన్న క్యాంటీన్ల ప్రారంభించామన్నారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే విధంగా వైద్యులు పని చేస్తున్నారన్నారు. పి.ధనంజయులునాయుడు, పొన్నారావు, గురవారెడ్డి, చెంచయ్యనాయుడు, మునెయ్య, హరిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుబ్బరామిరెడ్డి, జయచంద్రారెడ్డి, తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ: టీడీపీ

ఏర్పేడు, సెప్టెంబరు 23: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ వచ్చిందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు కబ్జా చేసిన ప్రభుత్వ స్థలాలను కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటోందన్నారు. కొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులే ఆక్రమణలను తొలగిస్తున్నారన్నారు. మర్రిమందలో ఎక్స్‌కవేటర్ సాయంతో డంపింగ్ యార్డును టీడీపీ నాయకులు శుభ్రం చేయించారు.

వగత్తూరులో పొలంబడి

కేవీబీపురం, సెప్టెంబరు 23: మండలంలోని వగత్తూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయధికారి మురళీకృష్ణకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం, సమాచారాన్ని అందించటానికి ప్రభుత్వం ప్రత్యేక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. సాగులో ఏ సమస్యలను వచ్చినా అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపినాథ రెడ్డి, సురేష్‌రెడ్డి, జనసేన నాయకుడు థామస్, టీడీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ధ్వజ స్తంభం వద్ద యరపతినేని

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్రం మెదక్‌కు చెందిన మధునానంద సరస్వతి మఠ పీఠాధిపతి మాధవానంద సరస్వతి దర్శించుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు.

పుత్తూరు వార్తలు

క్రోచెట్స్ ప్రదర్శనలో సునంద గిన్నిస్ రికార్డ్


క్రొచెట్స్ ప్రదర్శనలో సునంద - అవార్డు అందుకుంటూ...

పుత్తూరు, సెప్టెంబరు 23: పట్టణానికి చెందిన జి.సునంద క్రొచెట్స్ ప్రదర్శనలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించారు. ఆమె మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్ సంస్థ సభ్యురాలు. గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 450 మంది మహిళల ఆధ్వర్యంలో 58,112 క్రొచెట్స్ స్క్వేర్స్‌ను సంస్థ తయారు చేసింది. వీటితో విశాఖపట్నంలోని ఓ ఫంక్షన్ హాలులో ఈనెల 22న ఆదివారం ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ... ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్తువులను అనాథలకు పంపిణీ చేస్తామన్నారు. కాగా గత ఏడాది డిసెంబర్ 22న అమ్మమ్మ ఒడికి చెందిన 76 మంది సభ్యులు ఫేస్‌బుక్ ద్వారా ఆన్‌లైన్‌లో 7003 చాక్లెట్లను తయారు చేసి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. తన తండ్రి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ సుబ్రమణ్యంరాజు పోత్సాహంతో తాను రికార్డులు సాధించినట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ


మంజునాథ గౌడ్

పుత్తూరు, సెప్టెంబరు 23: పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌గా సోమవారం సాయంత్రం మంజునాథ గౌడ్ పదవీ బాధ్యత లను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కెఎల్ఎన్ రెడ్డి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో నగరి నుంచి గౌడ్ నియమితులైనారు. ఈ సందర్భంగా డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఓ పెంచలయ్య, టీపీవో మూర్తి, ఏఈలు కార్తికేయ, హేమశేఖర్ ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

క్రీడా పరికరాల వితరణ

వడమాలపేట, సెప్టెంబరు 23: మండలంలోని ఎస్వీపురం ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానికులు తులసీరాం, గోవిందమ్మ క్రీడా పరికరాలను వితరణగా అందజేశారు. సోమవారం సుమారు రూ.20 వేల విలువైన క్రీడాపరికరాలను అందజేశారు. విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని దాతలు కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రకాశం, వెంకటరాజు, చిరంజీవి, రాజు, టీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

డీకేటీ పట్టాలు మంజూరు చేయండి


కలెక్టరేట్ వద్ద దళితుల నిరసన

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 23: మండలంలోని వీఎస్ఎస్ పురంలో తమకు డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని సోమవారం దళితులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకుడు నందయ్య మాట్లాడుతూ... వీఎస్ఎస్ పురం లెక్క దాఖలా సర్వేనెం.57 పక్కన స్థానిక దళితులు 20 సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అర్హులైన దళితులుకు డీకేటీ పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కే.లక్ష్మి, వెంకటయ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

27న మహాజన సభ

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 23: మండలంలోని పరమేశ్వరమంగళం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మహాజన సభను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు తిరుపతి అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి ఝాన్సి సీఈవో శివప్రసాద్ తెలిపారు. సమావేశంలో 1 ఏప్రిల్ 2024 నుంచి 31 ఆగస్టు 2024 వరకు జరిగిన లావాదేవీలు, జమ, ఖర్చుల ఆమోదంపై ఆడిట్ రిపోర్ట్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగు ఈ నెల 28న తడుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మహాజన సభ జరుగుతుందని సీఈవో వేణుగోపాల్ తెలిపారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన వైసీపీ: ఎమ్మెల్యే సుధీర్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: ప్రపంచ నలుమూల్లోని శ్రీవారి భక్తుల మనోభావాలను గత వైసీపీ ప్రభుత్వం ఘోరంగా దెబ్బతీసిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... తిరుమల పవిత్రతను అపహాస్యం చేసే విధంగా గత వైసీపీ పాలన సాగిందన్నారు. ధనార్జనే ధ్యేయంగా శ్రీవారి ప్రసాదాలను సైతం కలుషితం చేసిన వైసీపీ నేతల పాపం ఊరికే పోదన్నారు. ఘోరమైన నేరానికి పాల్పడిన వైసీపీ నేతలను శ్రీవారి భక్తులు అడుగుడునా నిలదీయాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో తాను గెలిచిన రెండో రోజే తనిఖీలు నిర్వహించామన్నారు. అందులో భాగంగా అదే సమయంలో నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షించామన్నారు. అనంతరం ప్రసాదం తయారీ పోటు, నెయ్యి నిల్వ చేసే స్టోర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి దూరంగా బతుకు

మాజీ సీఎంకు ఎస్సీవీనాయుడి సూచన

మాజీ సీఎం జగన్ ప్రజలందరికీ క్షమాపణ చెప్పి... రాజకీయాలను వదలి సభ్యసమాజానికి దూరంగా బతకాలని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు హితవు పలికారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై శ్రీకాళహస్తిలోని ఆయన స్వగృహంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులు ఆరాధించే తిరుమల సన్నిధిలో గత వైసీపీ పాలకులు కల్తీకి పాల్పడటం నీచమైన చర్యగా అభివర్ణించారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీలో భాగస్వాములైన వారందరికీ తగిన శిక్ష తప్పదన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నెలకు 8 టన్నుల నెయ్యి వినియోగం జరుగుతోందన్నారు. ఈ ఆలయంలో కూడా నెయ్యి కల్తీపై భక్తుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ముక్కంటి ఆలయంలో నెయ్యి కల్తీపై ప్రత్యేక అధికారితో విచారణ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.మునిరామయ్య, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, టీడీపీ నాయకుడు నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించి ఆదుకోండి

రైతు వెంకటసుబ్బారెడ్డి ఆవేదన


కంచె చూపుతున్న వెంకటసుబ్బారెడ్డి

రేణిగుంట, సెప్టెంబరు 23: విమానాశ్రయం రన్‌వే కోసం తీసుకున్న భూమికే పరిహారం ఇవ్వకపోగా కొత్తగా ఉన్న భూమిని ఇవ్వాలని నోటీసులు పంపడంపై రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపాళెం గ్రామ లెక్క దాఖలా సర్వే నెం.140-1ఎ్1లో రెండున్నర ఎకరాల్లో సేద్యం చేసుకుంటూ జీవనం సాగించే వాడినని రైతు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. 2012లో 63 సెంట్లు విమానాశ్రయం రన్‌వే కోసం తీసుకుని ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వకపోగా నేడు మరో 72సెంట్లు స్థలం ఇవ్వాలని రెవెన్యూ అధికారులు నోటీసలు జారీ చేయడం భావ్యమా అని ప్రశ్నించారు. ఇది వరకే తీసు కున్న భూమి పరిహారం కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగానన్నారు. మిగిలిన భూమిలో సేద్యం చేయాలనుకుంటే పక్కనే ఉన్న చెరువుకట్టను రాత్రి వేళలో తొలగించి విమానాశ్రయ విస్తరణ పనులు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేకపోతే ఆత్మహత్యే శరణ్యమన్నారు.

వంద రోజుల్లోనే ప్రగతి


కేవీబీపురంలో కరపత్రాల పంపిణీ

కేవీబీపురం/ పిచ్చాటూరు, సెప్టెంబరు 23: కేవీబీపురం మండలంలోని తిమ్మసముద్రం, రాయపేడు, వగత్తూరు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమని ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు దొరబాబునాయుడు, సురేష్ రెడ్డి, టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. పిచ్చాటూరు, నీరువాయి గ్రామాల్లో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు 4వ రోజు సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. వీఆర్వో ప్రియాంక, టీడీపీ నాయకురాలు రజని తదితరులు పాల్గొన్నారు.

27న పల్లికొండేశ్వరాలయ దుకాణాల వేలం

నాగలాపురం, సెప్టెంబరు 23: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ ఆవరణలోని పలు దుకాణాలకు సంబంధించి ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని కూల్‌డ్రింక్స్ షాపుకి సంబంధించి 2024 నవంబరు 5 నుంచి 2025 నవంబరు 4వ తేదీ వరకు, అలాగే ఇత్తడి పూజా సామాన్లు, స్వామివారి వస్త్రాల విక్రయ హక్కుకు 2024 డిసెంబరు 1 నుంచి 2025 నవంబరు 30 వరకు, పిల్లల ఆట వస్తువులు, భక్తుల పాదరక్షల భద్రపరిచి రుసుము వసూలుకు 2024 అక్టోబరు 5 నుంచి 2025 అక్టోబరు 4 వరకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆలయ కార్యాలయంలో ధరావతుగా రూ.10 వేలు చెల్లించాలని ఈవో తెలిపారు.

నిధుల స్వాహాపై చర్యలు తీసుకోండి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 23: మండల కేంద్రానికి సంఘమిత్ర చేతివాటంతో రూ.6లక్షలు స్వాహా చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని పొదుపు సంఘాల మహిళలను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ పొదుపు సంఘాలకు సంఘమిత్రగా పనిచేసిన బాషా తమను ఏమార్చి రూ.6లక్షలను స్వాహా చేశారన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగ గిరిజన కాలనీవాసులు చంద్రయ్య, ఈశ్వర్‌పై దాడి చేసిన రాజారెడ్డి, అతని బంధువులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ... ఇళ్ల మధ్య దారి ఇవ్వలేదనే కారణంతో మూకుమ్మడి దాడి చేశారన్నారు. మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూనాటి సురేష్‌కు అభినందన



శ్రీకాళహస్తి,సెప్టెంబరు 23: మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌ను సోమవారం రాజధాని అమరావతిలో కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు అభినందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది చేతుల మీదుగా అందుకోవడం హర్షణీయమని ప్రశంసించారు. విద్యాశాఖకు మరన్ని సేవలందించాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ

రేణిగుంట, సెప్టెంబరు 23: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. సోమవారం మండల పరిధిలోని కరకంబాడీ జడ్పీ ఉన్నత పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు తేజవతి, నాయకులు వెంకటాద్రి యాదవ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితోనే సామాజికాభివృద్ధి

ఏర్పేడు, సెప్టెంబరు 23: మహిళాభివృద్ధితోనే కుటుంబ, సామాజిక అభివృద్ధి సాధ్యమని అందుకు రాస్ సంస్థ కృషి చేస్తుందని పాపానాయుడుపేట కోటక్ మహేంద్ర బ్యాంకు మేనేజరు సుమలత అన్నారు. పాపానాయుడుపేటలో సోమవారం రాస్ మహిళా భారతి శాఖ, భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి జీవనోపాధుల మంత్రిత్వశాఖ సంయుక్తంగా మహిళలకు సోమవారం ఉచితంగా బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ... మహిళలు చేతివృత్తులను క్రమశిక్షణతో నేర్చుకుని నిష్ణాతులైతే తమ బ్యాంకు ద్వారా రుణాలను మంజూరు చేస్తామన్నారు. రాస్ ప్రాజెక్టు అధికారి బాలాజీ రెడ్డి, అన్నాదొరై, వెంకటకుమార్, మునిపార్థసారథి, శిక్షకురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 23: మండలంలోని కువ్వాకొల్లిలో సీసీఎల్ కాంటినెంటల్ కాఫీ పరిశ్రమ యాజమాన్యం తమ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా సంతవేలూరు పంచాయతీలో తాగునీటి కష్టాలను పరిష్కరించేందుకు చొరవచూపింది. రెండో అతిపెద్ద పంచాయతీ సంతవేలూరులో దీర్ఘకాలంగాప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి అవస్థలను గుర్తించి రూ.3లక్షలతో రెండు ప్రాంతాల్లో తాగునీటి బోర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. సోమవారం సీసీఎల్ కంపెనీ పీఆర్వో కృష్ణకిషోర్, ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు తాగునీటి బోర్లను ప్రారంభించారు. ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు మానుకోండి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 23: గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపడుతున్న తమకు పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని పంచాయతీ కార్మికులు కోరారు. తమపై రాజకీయ వేధింపులు మానుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్ నాగార్జున, నాయకులు మునేంద్ర, ధర్మయ్య, కొండయ్య, పోలయ్య, అమ్ములు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: ఇసుక అక్ర మ రవాణాను అడ్డుకోవాలని టీడీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు శ్రీకాళహస్తి 2వ పట్టణ సీఐ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం ఆయన సీఐను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మురళీనాయుడు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి ఉంచిందన్నారు. అక్రమంగా ఎవరైనా రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. తొట్టబేడు మండలంలో విరుపాక్షపురం, పెద్దకనపర్తి, పెన్నలపాడు సమీపంలో స్వర్ణముఖి నది నుంచి వైసీపీ చెందిన వారు ఇసుక అక్రమంగా రవాణా చేసి డంప్ చేసి ఇతర ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారన్నారు. దీంతో సామాన్యులకు ఇసుక దొరకపోవడం సహా భవన నిర్మాణ కార్మికులుకు పనులు లేకుండా పోతోందని చెప్పారు. మండల బీజేపీ అధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత



వరదయ్యపాళెం, సెప్టెంబరు 23: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. కాళంగి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా వీఆర్వో ట్రాక్టర్‌ను పట్టుకుని కార్యాలానికి అప్పగించారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనం

ఏర్పేడు, సెప్టెంబరు 23: మండలంలోని వికృతమాలలో చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన భారీ వినాయక ప్రతిమను సోమవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన భారీ లడ్డూను గ్రామస్థుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. డాక్టర్ పసుపులేటి శివప్రసాద్ రూ.25వేలకు దక్కించుకున్నారు. నిమజ్జనం అనంతరం లడ్డూను గ్రామస్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వి.బాలాజీనాయుడు, హేమాక్షి రాయల్, ఆర్.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి సాదర స్వాగతం



రేణిగుంట, సెప్టెంబరు 23: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి తిరుపతి విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. సోమవారం హైదరాబాద్‌నుంచి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, జల్లి మధుసూదన్, పురుషోత్తంనాయుడు, బాబునాయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, కంభం నిరంజన్‌రెడ్డి తదితరుల ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గానా ఆయన స్వగ్రామం నగరిపల్లెకు బయలుదేరి వెళ్లారు

రాష్ట్రస్థాయికి ఎంపికైన చెంచమ్మకు ప్రైజ్‌మనీ



ఏర్పేడు, సెప్టెంబరు 23: హెచ్ఐవీ, ఎయిడ్స్ రెడ్ రిబ్బన్ సంయుక్తంగా ఈనెల 18న నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థిని చెంచమ్మ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సోమవారం చెంచమ్మకు కలెక్టర్ వెంటేశ్వర్ రూ.7వేలు ప్రైజ్‌మనీ చెక్, ప్రశంసాపత్రం అందజేశారు. ఇందుకు కృషి చేసిన నోడల్ పర్సన్ సుబ్రహ్మణ్యంను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్, బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రివార్డు అందుకున్న హసీనా



రేణిగుంట, సెప్టెంబరు 23: జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నగదు బహుమతిని అందుకున్నారు. ఈనెల 1న జరిగిన యూత్ ఫెస్టివల్‌లో క్విజ్ పోటీలు నిర్వహించారు. అందులో రేణిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని హసీనా రెండవ స్థానంలో నిలవడంతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా నగదు పురస్కారాన్ని అందుకుంది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధని అభినందించారు.

మృత్యుంజయుడికి ఆగమోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో అభిషేకించారు. అనంతరం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

25న శాంతి హోమం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 25న బుధవారం శాంతి హోమం నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. మహాశివుడి జన్మనక్షత్రం ఆరుద్ర రోజున ఆలయంలోని అచ్యుత రాయలు మండపం వద్ద ఉదయం 9గంటలకు జరుగుతుందన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: చైల్డ్ పోర్నోగ్రఫీపై ఇటీవల మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చిందని... చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం... డౌన్‌లోడ్ చేయడం పోక్సో చట్టప్రకారం నేరమేనని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం హర్షణీయమని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పిల్లలు, వారి హక్కులు, అభివృద్ధికి పనిచేస్తున్న సంస్థలకు, కార్యకర్తలకు ఈ తీర్పు ఊరట నిచ్చిందన్నారు. దీంతో బాలికలపై జరుగుతన్న అఘాయిత్యాలను అడ్డుకోవచ్చని తెలిపారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

నారాయణవనం/ పిచ్చాటూరు, సెప్టెంబర్ 23: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పాలమంగళంలో ఈనెల 24 నుంచి ప్రారంభించనున్నట్లు ఏవో శోభారాణి తెలిపారు. రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు, రాబోయే రబీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ, సెరికల్చర్ తదితర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. పాలమంగళం గ్రామంలో కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ఇకపై ప్రతి మంగళ, బుధవారాల్లో జరుగుతుందని, రైతుల వద్దకే వ్యవసాయ అధికారులు, సిబ్బంది వస్తారని ఏవో సంజీవరెడ్డి తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే లాగా యాంత్రీకరణపై అవగాహన కల్పిస్తామన్నారు.